# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :12 సంచిక: 11 హైదరాబాద్ 2013 మార్చి పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-



# ఉత్తర కాశీలో మెహెర్ ప్రేమిక సహవాస్

**అవతార్ మెహెర్‌బాబా ప్రేమిక సహవాస్‌ను ఉత్తరాంచల్ రాష్ట్రంలోని ఉత్తర కాశీలో ఏప్రిల్ 10, 11 తేదీలలో ఏర్పాటుచేశారు.**

1948 ఏప్రిల్ 10, 11 తేదీలలో మెహెర్‌బాబా ఉత్తరకాశీలో మస్తుల సాంగత్యం చేశారు. తన మండలి సభ్యులైన ఏరుచ్, కాకాబారియా, గుస్తాద్‌జీ, బైదుల్ తదితరులతో కలిసి ఉత్తర కాశీలో మస్తుల అన్వేషణలో పాల్గొన్నారు. బాబా ఇక్కడ 25 మంది సాధువులను, 35 మంది మస్తుల సాంగత్యం చేశారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళవి (1948 ఏప్రిల్). తీవ్ర ఎండాకాలం. బాబా ముందుగా కలకత్తా నుంచి రుషీకేష్ దాకా వెళ్ళి అక్కడ నుండి టెహ్రీఘర్‌వాల్ అనే గ్రామానికి బస్సులో చేరుకున్నారు. అక్కడ నుండి 40 కి.మీ. దూరంలో హిమాలయ సానువుల్లో "పావన గంగోత్రి" సమీపంలో వున్న ఉత్తర కాశీకి కాలి నడకన చేరుకున్నారు. ఈ పాదయాత్రలో బాబా బృందం అనేక ఇక్కట్లు ఎదుర్కొంది. ఎండాకాలం కావడంతోపాటు సరైన రహదారిలేని రోడ్లపై నడిచే వీరి కాళ్ళకు బొబ్బలు ఎక్కాయి. కాకాబారియాకయితే స్వల్ప గుండెపోటు కూడా వచ్చింది. కాకాబారియాకు అప్పటికే ఐదు పదుల వయస్సు దాటింది. మెహెరుడి పాదస్పర్శతో పునీతమైన ఉత్తర కాశీలో డెహ్రాడూన్ బాబా ప్రేమికులు రెండ్రోజుల ప్రేమిక సహవాస్‌ను ఏర్పాటుచేశారు.

ఆసక్తిగలవారు ముందుగా రిషీకేష్ కబీర్ ఆశ్రమానికి ఏప్రిల్ 8, రాత్రి 8 గంటలకల్లా చేరుకుని అక్కడ బాబా ప్రేమికులు శ్రీ అనుపం శర్మ (092 195 10674) వద్ద తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. ఏప్రిల్ 9న రిషీకేష్ నుండి ఉదయం 7 గంటలకు ప్రత్యేక బస్సులో ఉత్తర కాశీకి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో చేరుకుంటారు. ఏప్రిల్ 10, 11 లలో ఉత్తర కాశీలో బాబా సహవాస్ జరుపుకుని తిరిగి రిషికేష్‌కు ఏప్రిల్ 12 సాయంత్రానికి చేరతారని బాబా ప్రేమికులు శ్రీ నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో పాల్గొనగోరువారు రవాణా, భోజన, బస ఏర్పాట్లు కోసం రూ.1500– చెల్లించవల్సిందిగా నిర్ణయించారు. మరిన్ని వివరాలకు డా. ఎస్. నాగేంద్ర ప్రసాద్ (94406-02754) సంప్రదించగలరు.

## మెహెర్‌స్థాన్ ధర్మశాల 8వ వార్షికోత్సవం

మెహెర్‌స్థాన్ ధర్మశాల 8వ వార్షికోత్సవం 2013 జూలై 28, ఆదివారం ఉదయం 7.30 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వై.ఎస్. రావు (98481 11671) ఒక ప్రకటనలో తెలిపారు.

## బాబా సందేశం

ఆధ్యాత్మిక ఉన్నతి ఆశించేవారు తమ అహంకారం క్రమేణా తగ్గించుకోవాలి!!

The most essential condition of spiritual advancement is the diminishing of the ego to its minimum

– మెహెర్‌బాబా

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595–53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. బాబా జన్మదినోత్సవాలు 6–11
3. ఘజల్ గంధర్వ – బేగం అక్తర్ 12–14
4. 1965 ఫిబ్రవరి 25 15
5. చిరస్మరణీయం 16–17
6. విధేయతలోనే – అవిధేయత 18–19
7. లార్డ్ మెహెర్ 20–26
8. మెహెర్‌స్థాన్ పసిడి పండుగ వేడుకలు 27–29
9. ప్రత్యేక ఎగ్జిబిషన్ 30–33
10. డా॥ ఎ.కె. వసుమతి బాబాలో ఐక్యం 34–35
11. మా మాటలు 36–37
11. ప్రార్థనలు

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్–500 087
ఫోన్: 99595–53218

**మనవి**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# సార్ధకజన్ముడు



**మెహెర్‌బాబాతో డాక్టర్ అబ్దుల్ ఘనీ మున్సిఫ్** శీర్షికతో క్రొత్త ధారావాహిక తెలుగు అనువాదం సీరియల్‌ను 2013 ఏప్రిల్ సంచిక నుండి ప్రచురించనున్నాం. దయచేసి పరిశీలించండి.

తొలితరం బాబా మండలి సభ్యుడు డా. అబ్దుల్ ఘనీ మున్సిఫ్. డా॥ ఘనీగా బాబా ప్రేమికులందరికీ సుపరిచితుడు. డా॥ ఘనీ మెహెర్‌బాబా మండలి సభ్యుడే కాదు – మెహెర్‌బాబాకు చిన్ననాటి స్నేహితుడు కూడా. పూనేలో బాబావారి ఇంటి దగ్గర్లోనే ఘనీ సాబ్ ఇల్లు కూడా వుండేది. వీరి పరిచయం 1920 నాటిది. ఐతే, **1920 నుండి 1940** దాకాబాబాతో ఆయన అనుబంధాన్ని **TWENTY YEARS WITH MEHER BABA పేరుతో• ఆనాటి మెహెర్‌బాబా మ్యాగజైన్‌లో** ఇంగ్లీషులో ధారావాహిక సీరియల్‌గా ప్రచురించారు. మెహెర్‌బాబా జర్నల్‌ను బాబా సమక్షంలో **1938 – 1942** నడుమ ప్రచురించిన విషయం పాఠకులకు తెలుసు. ఈ అవతార కాలంలో **1920 నుండి 1940** అత్యంత ప్రధానమైనది. జనవరి 1914లో పూనేలో బాబాజాన్ బాబావారి భృకిటిని ముద్దాడింది.అనంతరం ఉపాసనీ మహారాజ్ సాకోరీ ఆశ్రమంలో బాబా గడిపారు. ఆ పిదప బాబా తన తొలి మండలి సభ్యుల ఏర్పాటు చేశారు.

డా.ఘనీ హోమియోపతి వైద్యం ప్రాక్టీసు చేశాడు. గొప్ప కవి పండితుడు. ఆయన మంచి అందగాడే కాదు, గొప్ప మేధావిగా, **VOICE OF HIS MASTER** గా బాబాచే ప్రస్తుతించబడ్డాడు. 1951 ఆగస్టు 20న పూనేలో తీవ్ర గుండెపోటుతో హఠాత్తుగా డా.ఘనీ తనువు చాలించాడు. ఆ సమయంలో బాబా హైదరాబాద్‌లో వున్నారు.

“To me, More than to any of you, Ghani was Unique, and of all the work that still remain to be done for me by others, there is much that could have been done for **ME** by Ghani and none else” అని బాబా పంపిన ఒక సందేశంలో ప్రస్తుతించారు. **సార్ధకజన్ముడు** డాక్టర్ ఘనీ. మెహెర్‌బాబా పాఠకులు 2013 ఏప్రిల్ సంచిక కోసం ఇప్పటి నుండే ఎదురు చూడగలరు!! దయచేసి మీ అమూల్య అభిప్రాయాలు తెలియజేయగలరు!!!! **–ఎడిటర్.**

## సంపాదకీయం

# మెహెర్‌బాబా కార్యక్రమాలు

నా కార్యక్రమాల నిర్వహణకు మీ సహాయం అవసరం లేదు. ఐనప్పటికీ, మీలో చాలామంది కార్యకర్తలని నాతో ఉండమని, నా కార్యక్రమాలు చేపట్టమని చెబుతున్నాను. నా కార్యక్రమాల నిర్వహణ పనితీరును ఒక్కసారి వెనక్కి తిరిగి పరిశీలించండి!!

నేను శాశ్వతమైన పనులు ఏదీ ఎన్నడూ చేయలేదు. ఆసుపత్రులు, స్కూళ్ళు, ఆశ్రమాలు ఇలా అన్నీ చేపట్టాను. అవన్నీ కాలగమనంలో మూసేసాను. కారణం ఏమంటే, అవేవీ నాకవసరం లేదు. ఐతే, నాకు కార్యకర్తలతో ఏం పని? ఎందుకో బాబా ఇలా వివరణ ఇచ్చారు. దేవుడు దయతలచి నా కార్యకర్తలకు ఏమైనా ఇవ్వమంటే దాన్ని తీసుకోవడానికి వారిని సిద్ధంగా వుంచాలి కదా! అందుకు అని అంటూ బాబా తన కార్యకర్తలకు ఇలా హితబోధ చేశారు. మీరెన్నడూ వివాదాల్లోకి తల దూర్చకండి! గ్రూపులు, తగాదాలు, సంఘాలు లాంటివి దరిరానీయకండి! అందరూ ఒక్కటిగా సంఘటితంగా నా ప్రేమ సందేశవ్యాప్తికి హృదయపూర్వకంగా, నిజాయితీగా కృషి చేయండి.

సాధారణంగా నదులన్నీ సముద్రుడిలో కలుస్తాయి. కానీ నేడు జీవనదులు కూడా ఎండిపోతున్నాయి. సముద్రమే నదుల్లోకి పొంగి ప్రవహించాల్సిన సమయం ఆసన్నమైంది!!

నిజాయితీగా, స్వచ్ఛందంగా పనిచేయండి! భగవంతుడు అన్నింటా – అందరిలో ఉన్నాడు. ఆయనకి అన్నీ అవగతమే! మీరేం అడగకపోయినా, మీరు చేసిన పనికి తగిన మంచి బహుమతి ఆయన తప్పక ఇస్తాడు.

| | |
|---|---|
| Only God is Real. | God is all Love. |
| God is all Wisdom. | God is all Power. |
| God is all Beauty. | God is Everything. |

ఐతే, దేవుడి నుండి మిమ్మల్ని ఒకే ఒక్కటి దూరంగా ఉంచుతోంది.

అదేమంటే **'అహం భావం'!! (Ego )**.

**SO LEAD A PURE LIFE** అని బాబా అన్నారు.

మెహెర్‌బాబా ఈ సందేశాన్ని 1954 జూలై 26న డెహ్రాడూన్ నుండి తెలుగువారికి ప్రత్యేకంగా పంపారు. బాబావారి ఈ సందేశం సుమారు అర్ధ శతాబ్ధి క్రితం ఆనాటి ప్రేమికులకిచ్చినా, నేటికీ చాలా అవసరం. ఎప్పటికీ ఆచరణీయం.

**అస్మదీయులు – తస్మదీయులన్న భావన వద్దు!!**

**అందరూ ఒక్కటే!!**

**మెహెర్‌బాబా కార్యక్రమాలు నూతనోత్సాహంతో చేపడదాం!!** ❀

# బాబా జన్మదినోత్సవాలు

## ప్రత్యేక వ్యాసం

యావత్తు ప్రపంచంలోని బాబా ప్రేమికులు **ఫిబ్రవరి 25న** మెహెర్‌బాబా 119వ జన్మదినోత్సవాన్ని ఎంతో వేడుకగా జరుపుకున్నారు. ఆ రోజున తెల్లవారుఝామున 5 గంటలకే బాబా ప్రేమికులు వారి వారి బాబా సెంటర్లలో ప్రార్థనలు, ఆరతి, అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.



నగర సంకీర్తనలు నిర్వహించారు. సప్తవర్ణ పతాకాలను ఎగుర వేశారు. ధుని వెలిగించారు. కొన్ని బాబా సెంటర్లవారు ముఖ్యంగా ఉత్తర ఆంధ్రాలోని విజయనగరం, శ్రీకాకుళం సెంటర్లవారు తమకు తోచిన రీతిన ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంచారు. అనాధలను ఆదుకునే రీతిలో దుస్తులు పంపిణీ చేశారు. హైదరాబాద్ కోఠి సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు.

మరికొన్ని సెంటర్లవారు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎవరు ఏ కార్యక్రమం చేపట్టినా అందరి ఉద్దేశ్యం ఒక్కటే.

అవతార్ మెహెర్‌బాబాను సంతోషపరచాలన్నదే కావడం విశేషం.

మెహెర్‌బాబా తన 60వ జన్మదినోత్సవ సందర్భంగా ఇచ్చిన ఒక సందేశంలో
**మనందరం ఒక్కటే. భగవంతుడు ఒక్కడే సత్యం.**
**మిగిలినదంతా అసత్యం అని స్పష్టం చేశారు.**
(**We are all one, that God alone is real and that all else is false)**

మెహెర్‌బాబా పూనే మహా నగరంలో ససూన్ ఆసుపత్రిలో 1894 ఫిబ్రవరి 25న షిరీన్‌మాయి, షిరియార్జీ జొరాష్ట్రియన్ దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు. 1969 జనవరి 31న బాబా తన భౌతికదేహం త్యాగం చేశారు.

అనంతరం, ఆయన్ని ఏడు రోజులపాటు, అంటే, ఫిబ్రవరి 7 దాకా , అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రం నుండి ఐదు కిలో మీటర్ల దూరంలో గల మెహెరాబాద్‌లో గల సమాధిలో మెహెర్‌బాబాను బాబా ప్రేమికుల దర్శనార్థం వుంచారు. ఏడవ రోజున, అంటే, ఫిబ్రవరి 7న సమాధి చేశారు. జొరాష్ట్రియన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 7వ తేదీ, అవతార్ మెహెర్‌బాబా జన్మదినోత్సవం అయ్యింది. పుట్టినరోజునాడే అవతారుని అమరతిథి కూడా అయింది. ఇదే అవతారుని విశిష్టత. జనన మరణాలకు తాను అతీతుడనని మెహెర్‌బాబా 1950వ దశకంలోనే ప్రకటించారు. మెహెర్‌బాబా ఒక సందేశంలో ఇలా అన్నారు....

I am never born, I never die. Yet, every moment, I take birth and undergo death. The countless illusory births and deaths are necessary landmarks in the progression of man's consciousness to Truth — a prelude to the Real Death and Real Birth. Real Death is when one dies to self, and Real Birth is, when dying to self, one is born in God, to live forever His eternal life consciously. I say with divine authority today that I am the Ancient One and the slave of those who really love me.

మెహెర్‌బాబా తానేమీ మహత్యాలు చేయనని అనేక సందర్భాల్లో అన్నారు. తనను నిరంతరం హృదయపూర్వకంగా స్మరించమన్నారు. నీవు ఎల్లప్పుడూ ద్వేషించే వాళ్ళతో కూడా ప్రేమగా ఆప్యాయతతో వుండటం అలవరచుకోమన్నారు. అలా చేయడమే తనను ఆరాధించడమని స్పష్టం చేశారు.

**ఐతే, మనబోటి సామాన్యులకు ఈ పథంలో పయనించడానికి చాలా కాలం పట్టవచ్చు.**

అన్ని కష్టాలకు ఒక చిట్టచివరి గమ్యం అనేది వుంటుంది.ఆధ్యాత్మిక చింతనకు మాత్రం అంతం అనేది లేదు. ఆధ్యాత్మిక ఆనందం అనంతమైనది, శాశ్వతమైందని అని అంటూ మీ మంచితనం, చెడు లక్షణాలు అన్నీ నాకు సమర్పించి, నాలో మీరు అనంత ఆనందాన్ని అనుభవించమని బాబా ఒక సందేశంలో పేర్కొన్నారు.

బాబావారిచ్చిన ఈ సందేశాన్ని ఒకసారి పరిశీలించండి.

"I may give you nothing". I may give you more, much more than you expect, or may be nothing, and that nothing may prove to be everything. So

I say, come with open hearts to receive much or nothing from the Divine Beloved. Come to receive not so much of My words but of My Silence.

God does everything and in another sense does nothing.

Although God does nothing, those who approach Him with love and surrender derive everything that matters in the spiritual realm.

**ఈ సందేశానికి స్వేచ్ఛానువాదం ఇలా వుంది....**

నేను బహుమతిగా నీకేమి ఇవ్వకపోవచ్చు. నీవు ఆశించిన దానికంటే కూడా ఎక్కువ బహుమతిని నేనియ్యవచ్చు. లేదా ఏమీ ఇవ్వకనూ పోవచ్చు. అయితే, నేను ఏ బహుమతీ ఇవ్వకపోవడమే ఎన్నో బహుమతులు ఇచ్చినట్లు కూడా.

కాబట్టి, నేను బహుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా, ఏమిచ్చినా అందుకునేందుకు వీలుగా మీలో ఎలాంటి ఆలోచనలు, కోరికలు లేకుండా నా దగ్గరకు రండి అని బాబా తన ప్రేమికులకు పిలుపు ఇచ్చారు. అలాగే, నేనేదో సందేశమిస్తానని, నా మాటలు వినడం కోసం కాకుండా, నా మౌనాన్ని అర్థం చేసుకోవడానికి నా దగ్గరకు రండి అని బాబా తన ప్రేమికులకు పిలుపు ఇచ్చారు. భగవంతుడు మిమ్ముల్ని అన్ని విధాల ఆదుకుంటాడు.

లేదా ఏమీ ఆదుకోలేకపోవచ్చు. భగవంతుడు ఏమీ చేసినా, చేయకపోయినా, ప్రేమతో, అంకితభావంతో, విధేయతతో, ఆయన దరి చేరితే, ఆధ్యాత్మికంగా అనంతమైన సహాయం ఆయన ద్వారా లభిస్తుందని బాబా తన ప్రేమికులకు స్పష్టం చేశారు.

మెహెర్‌బాబా అంటే తెలుగులో సమానార్థంగా **దయగల తండ్రి** అని చెప్పుకోవచ్చు. ఆయన ప్రేమావతారుడు. ప్రేమతో దేనినైనా సాధించవచ్చని బాబా సందేశం.

మెహెర్‌బాబా ఏ మతానికి చెందినవాడు కాదు. అన్ని మతాలు ఒక్కటే అంటూ– **'ప్రేమ'** తన మతం అని బాబా పలుమార్లు ప్రకటించారు.

## 1963లో బాబావారి జన్మదినోత్సవం

1963లో బాబావారి జన్మదినోత్సవానికి అహ్మద్‌నగర్ పోస్టాఫీసుకి పుంఖానుపుంఖాలుగా టెలిగ్రాంలు వచ్చిపడుతున్నాయి. ఆ రోజుల్లో టెలిగ్రాంలంటే కంప్యూటర్ల మీద కాదు కదా. టిక్ టిక్ మని చేత్తో టెలిగ్రాఫిక్ మాస్టారు కొడుతూ, దాన్ని ఆ తర్వాత డికోడ్ చేసి, ఇంకు కలంతో రాసి పంపేవారు. ఇప్పుడా విధానం చూద్దామన్నా లేదునుకోండి.

ఆ రోజుల్లో బాబా కార్యదర్శి ఆదీ.కె.ఇరానీకి అసిస్టెంటుగా ఫ్రెంజీ అనే బాబా ప్రేమికుడు ఉండేవాడు. అహ్మద్‌నగర్ టెలిగ్రాఫ్ ఆఫీసుకి అసంఖ్యాకంగా వస్తున్న టెలిగ్రాంల బట్వాడాకి తగినంత మంది మెసెంజర్లు పోస్టాఫీసులో లేరని చెప్పి, ఆ టెలిగ్రాంలను తీసుకోవడానికి బాబా తరపు నుంచి ఎవరినైనా పంపమంటే ఆదీజీ తన అసిస్టెంటైన ఫ్రెంని పంపాడు. స్థానిక పోస్టాఫీసువాళ్ళు ఎవరీ మెహెర్‌బాబా.. ఒక్కనికి ఇన్ని వేల

సంఖ్యలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపే టెలిగ్రాంలు వస్తున్నాయని వారు ఆశ్చర్యపడుతున్నారని మెహెరాజాద్‌లో వుంటున్న బాబా మండలి సభ్యుడైన ఏరుచ్‌కి పంపిన ఒక లేఖలో అనాటి సన్నివేశాన్ని ఫెర్రం రమణీయంగా ఇలా వర్ణించాడు.

పూణే, ముంబాయి పోస్టాఫీసు వాళ్ళు కూడా వరుసగా వస్తున్న ఈ టెలిగ్రాంల ధాటిని చూసి ఆశ్చర్యపడ్డారని ఫెర్రం తన లేఖలో పేర్కొన్నాడు.

నేను మాసి పోయిన గడ్డం, లూజు పంట్లాంపై బుషర్టు వేసుకుని, కాళ్ళకు హవ్వాయి చెప్పులతో వున్నాను. ఐనప్పటికీ, మెహెర్‌బాబా ప్రతినిధిగా పోస్టాఫీసువాళ్ళు తనకెంతో మర్యాద చేశారని.. **గౌరవించారని, సార్** ..సార్ అని సంభోదించారని, కూర్చోడానికి స్టూలు ఇచ్చి మర్యాదలు చేసారని, ఫెర్రం ఏరుచ్‌కి రాసిన లేఖలో ఉటంకించాడు.

సామాన్యుడనైన తనను వారు అసాధారణంగా గౌరవించారని ఫెర్రంజీ అనాటి విశేషాలు వివరించాడు.. ఇదిలావుంటే....

## 1964లో బాబావారి జన్మదినోత్సవం

1964 ఫిబ్రవరిలో బాబా జన్మదినోత్సవ వేడుకలనాడు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో మరో విశేషం జరిగింది.

టెహ్రాన్‌లో మసీదుల్లో ప్రార్థనలు చేసే ఇమామ్‌కి ఆ రోజు తెల్లవారురుఝామున కలలో అవతార పురుషుడైన **సాహెబ్-ఇ-జమానా** ఈ భూమ్మీద జన్మించాడని, టెహ్రాన్‌లో ఓ ఇంట్లో వున్నాడని, ఆ ఇంటి అడ్రస్ ఇతర వివరాలు ఒక అశీరవాణి ద్వారా వినపడుతుంది.

ఇమామ్‌కి ఈ కల చాలా స్పష్టంగా, వాస్తవంగా కళ్ళెదుట ఉన్నదిఉన్నట్లు అనుభూతి కలుగుతుంది. దాంతో తెల్లవారగానే, తాను కన్న కల ఆధారంగా అవతారుడు ఉన్న ఇంటిని వెదికి పట్టుకుని ఆ తలుపు తడితే, ఆ ఇంటి తలుపు తెరిచిన వ్యక్తితో తాను సాహెబ్ - ఇ -జమానా దర్శనార్థం వచ్చానని తాను కన్న కల గురించి ఇమామ్ అన్ని వివరాలు చెప్పాడు.

**IT MUST BE NOW & NOT THEN**
**- MEHER BABA**



"OBEY ME CHEERFULLY. TO OBEY ME NOW WHEN YOU HAVE NOT YET CONSICOUSLY EXPERIENCED MY GREATNESS IS A GREAT THING BECAUSE MUCH OF THE VALUE OF OBEDIENCE IS LOST, ONCE CONVICTION IS TRANSFORMED INTO ACTUAL CONSCIOUS KNOWLEDGE OF MY REALITY".

ఆ ఇంట్లో వుంటున్న వ్యక్తి ఎవరో కాదు..ఆతని పేరు అస్ఫాన్‌డైర్ విసాలి.

ఇతను మెహెరాబాద్‌లో 1920వ దశకంలో మెహెరాబాద్‌లో మెహెర్‌బాబా నిర్వహించిన మెహెర్ ఆశ్రమంలో చదువుకున్నాడు. ఆతను ఇటీవల కాలంలో 1963లో పూనేలో మెహెర్‌బాబాను దర్శించుకున్నాడు. ఆ వచ్చిన ఇమామ్ మాటలు విని అస్ఫాన్‌డైర్, ఆతని భార్య కళ్ళు చెమ్మగిల్లాయి. వారింట్లోనే చాలాకాలంగా బాబా సెంటర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఇమామ్ బాబా సెంటర్‌లోని అవతారుని నమస్కరించుకుని ఆ దరిమిలా అక్కడనించి నిష్క్రమించాడు..

మెహెర్‌బాబా చాలా స్పష్టంగా ఇలా అన్నారు.

## ఈనాడు నా మాటలు విశ్వసించి

ఈనాడు నా మాటలు విశ్వసించి ఎవరు నన్ను అవతారునిగా స్వీకరించి, నన్ను ప్రేమించి, నాకు విధేయులుగా వుంటారో అట్టి వారు ధన్యులు. వీరు నా ఎడల చూపే విధేయత చాలా గొప్పది..నిజమైనదీ అన్నారు బాబా.

నా మౌన విరమణానంతరం, నా అవతార ప్రకటీకరణ తర్వాత యావత్తు విశ్వం నన్ను గుర్తించడమే కాదు. అవతారునిగా స్వీకరిస్తారు. గొప్పగా ఆరాధిస్తారన్నారు. ఆనాడు మానవాళికి నన్ను అవతారునిగా స్వీకరించడం మినహా వారికి మరొక గత్యంతరం కూడా వుండదు. **(......then, I will be not only the expected One, but I will be the accepted One).** ఆనాడు మీరు నా ఎడల చూపే విధేయతకు ఎలాంటి ప్రాధాన్యత ఉండదని బాబా రెండు ఉదాహరణలుగా ఒక సందేశంలో ఇలా పేర్కొన్నారు. బోనులో వున్న సింహం ఎంత గర్జించినా ఆ దారిన పోయే ఎంత చిన్న జంతువూ సింహాన్ని చూసి భయపడదు.

అదే ఆ సింహం బోను లోంచి బయటపడితే, అడవిలో వున్న పెద్ద పెద్ద జంతువులు సయితం గజగజలాడతాయి.

మృగరాజుకి అడుగులకు మడుగులు ఒత్తుతాయి. అత్యంత విధేయతతో వుంటాయి. ఇది జగమెరిగిన సత్యం. అదే మాదిరి, నేను మౌనంలో వున్నంత కాలం బోనులో వున్న సింహం లాంటివాడినన్నారు బాబా.

## మరో ఉదాహరణలో,

కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునిడిని విల్లు ఎక్కుపెట్టవయ్యా అంటే ఆతను శ్రీకృష్ణుడికి ఏమని జవాబిచ్చాడో భగవద్గీతలో వివరంగా ఉంది కదా... యుద్ద భూమిలో ఉన్నవారందరూ తన బంధువులని, సోదరులని అర్జునుడు వాపోయాడు కదా అని బాబా అన్నారు. అదే పార్థుడు శ్రీకృష్ణుడి విశ్వరూప దర్శనం పొందాక,

భగవాన్ కృష్ణుడి మాటలకు ఏ మాదిరిగా అర్జునుడు కట్టుబడి వున్నాడో, ఆతను

చూపిన విధేయత మనకు తెలుసు. ఐతే, శ్రీకృష్ణుడి విశ్వరూప దర్శనం పొందాక అర్జునుడు చూపిన విధేయతకు ఎలాంటి విశిష్టత, ప్రాధాన్యత లేదని బాబా వివరించారు.

కృష్ణ పరమాత్మ భగవంతుడు అని తెలిసాక అర్జునుడు ఒక్కడేనా, యావన్మంది ఆయనకు మోకరిల్ల లేదా? అని బాబా ప్రశ్నించారు. అలాగే, నా మౌన విరమణకు మునుపు మీరు నా ఎడల చూపే విధేయతే అత్యంత విలువైనదిగా గమనించండని బాబా సున్నితంగా తన ప్రేమికులను హెచ్చరించారు. నా మౌన విరమణ తర్వాత, నా అవతార ప్రకటీకరణ తర్వాత యావత్తు విశ్వం నన్ను భగవంతునిగా ఆరాధిస్తుంది. అప్పుడు మీరు చేయగల్గింది ఏమీ ఉండదు అని బాబా తన సందేశంలో ప్రకటించారు.

కాబట్టి మీకిదే మంచి సమయం. భలే మంచి సమయం. ఈ సమయం మించిపోతే దొరకదు. సుజనులారా...బాబా నామాన్ని పలువురికి తెలియజేయండని బాబా కార్యదర్శి మరియు శిష్యుడైన ఆదీ. కె. ఇరానీ ఒక సందర్భంలో అన్నారు. ఆదీజీ ఇంకా ఇలా అన్నారు .... బాబా నామాన్ని మీరెలా తెలియజేస్తారు...అది మీ ఇష్టం. అదేదో మీ శక్తి సామర్థ్యాలను బట్టి వుంటుంది. మీకున్న లలిత కళల ద్వారా, వక్తృత్వం ద్వారానో, రచనల ద్వారానో, లేదా మీరు కేటాయించ గల సమయం, డబ్బు, శ్రమ, మరి ఇతర శక్తి యుక్తులు ద్వారా..

వ్యక్తిగతంగా గానీ లేదా సంఘటితంగానీ ...బాబా నామవ్యాప్తికి కృషి చేయమని హితవు చెప్పాడాయన. ఆ చేసేదేదో ఎప్పుడో .. ఎక్కడో కాదు....ప్రస్తుతమే..ఇప్పుడే..

అదేదో ప్రారంభించమని సూచించాడు ఆదీజీ.

బాబా గురించి మాకు తెలియజేయలేదని భవిష్యత్తరాలవారు మనల్ని నిందించకుండా ...బాబా నామాన్ని పలువురికి చేరవేసే ప్రయత్నం చేపట్టండని...

ఆదీజీ తన స్వానుభవంతో సూచించాడు.కాబట్టి బాబా ప్రేమికులారా...! ఆలోచించండి...సరైన తక్షణ చర్యలు చేపట్టండి...!!! ❃



## BABA'S WORK

**in the words of Sri ADI. K. IRANI, Meher Baba's Secretary & Deciple:**

*Time, money, labour, skill, art, literature, and rhetorics must be utilised for the work, whatever each can go either as a single move or as a group co-operation towards fulfillment of the object namely **"Baba's Work".***

*Hence what we can do towards above in anyway, in any measure, it must be **NOW and not then.***

***Let not posterity blame us for any failure in this regard.***

# ఘజల్ గంధర్వ - బేగం అక్తర్



1963 జనవరి 13, ఆ రోజు అనుకోకుండా, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, అనుకోని అతిథిలా ప్రముఖ గాయని, ఘజల్ గంధర్వగా కీర్తించబడే శ్రీమతి 'బేగం అక్తర్' తన కుమార్తెతో కల్సి మెహెరాజాద్ మెహెర్‌బాబా దర్శనార్థం వచ్చింది. ఆకాశవాణి, పూణేలో మ్యూజిక్ డైరక్టర్‌గా పనిచేస్తున్న గోల్ వాల్‌కర్ ఆమెను మెహెరాజాద్‌కు తీసుకొచ్చాడు.

బేగం అక్తర్ పాడే పాటలంటే మెహెర్‌బాబాకు ఎంతో ఇష్టం. ఆమె పాడిన పాటలు గ్రాంఫోన్ రికార్డులు బాబా దగ్గర చాలా వున్నాయి. మెహెర్‌బాబా సంగీత ప్రియుడు. గజల్సు అంటే ఆయనకెంతో మక్కువ.

ఒకసారి 1937 – 38 ప్రాంతంలోనే బేగం అక్తర్ బాబా ఎదుట కచేరీ నొకదాన్ని ఏర్పాటు చేసేందుకు బాబావారి కార్యదర్శి ఆదీ ప్రయత్నించాడు. లక్నో నుండి ఆమె మెహెరాబాద్‌కు వచ్చేందుకు తగిన రైలు చార్జీలు ఇస్తామని కబురు పంపారు.

ఆ రోజుల్లో ఆమె తన పారితోషికం చాలా ఎక్కువ చెల్లించాలని డిమాండ్ చేసింది. దాంతో బాబా ఇకపై ఆమెను పిలవాల్సిన పన్లేదు. ఏదో ఒక రోజున తనంత తానే ఇక్కడకు వస్తుందని – ఆదీతో అన్నారు. ఆ మాటే నిజమైంది. ఎలాంటి ఆహ్వానం లేకుండా నేడు ఆమెనే స్వయంగా బాబా దర్శనం కోసం వచ్చింది.

గత ఏడాది వేసవిలో పూణేలోని గురుప్రసాద్‌లో బాబా ఎదుట ఆమె కచేరి శ్రీ గోల్ వాల్కర్, ఆకాశవాణి అధికారి ఏర్పాటుచేశాడు. కానీ ఆ రోజుల్లో ఆమె ఆరోగ్యం బాగాలేదు. దాంతో ఆ కార్యక్రమానికి హాజరుకాలేకపోయిందామె.

నేడు బాబా ఎదుట ఆమె కూర్చుని కన్నీరు పెట్టుకుంది. ఎన్నో సంవత్సరాలుగా అవతారునితో అనుబంధం గల ప్రేమికురాలిగా ఆమె కంటతడి పెట్టింది.

అంతేకాదు నీ ఎదుట గానం చేసే అవకాశం లభించిన నాటి నుండీ నిన్ను దర్శించుకోవాలని పరితపించానని చెప్పింది. అంతేకాదు ఆనాటి నుండీ ప్రతిరోజూ బాబా చిత్రపటం ఎదుట కూర్చుని తాను భజన చేస్తున్నానని, భజన కీర్తనలు ఆలాపిస్తున్నానని వివరించింది. అలాగే ఈరోజున ఒక ఘజలు ఆలాపించేందుకు అనుమతి ఇవ్వమని బాబాని కోరింది. అందుకు బాబా ఈ రోజు కుదరదన్నారు. తాను ఏకాంతవాసంలో వుంటున్న రోజులని గుర్తుచేశారు. మీదు మిక్కిలి, తనకు ఘజల్సు వినాలనే ఉత్సాహం కూడా లేదన్నారు. కాబట్టి ప్రస్తుతం 'ఘజల్సు' వద్దని సున్నితంగా తిరస్కరించారు.

బేగంజీ మరింతగా ప్రాధేయపడుతుంటే నేడొక పాట పాడేందుకు ఆమెకు అనుమతిస్తానన్నారు. ఐతే, అందుకు ఒక షరతు. బాబా ఆ ఏడాది ఏప్రిల్ – లేదా మే నెల వేసవి సెలవుల్లో పూణేలోని గురుప్రసాద్‌లో వుండే సమయంలో ఆమె నాలుగైదు గంటలు ఏకబిగిన ఘజలు గానం చేస్తానని వాగ్దానం చేయాలన్నారు. అందుకు ఆమె ఆనందంగా అంగీకరించింది. ఆమె గాన గంధర్వగా, ఘజల్సు గానంలో రారాణిగా ప్రఖ్యాతి. ఆ రోజుల్లో ఆమె ఒక పాట పాడినందుకు వెయ్యి రూపాయలు పారితోషికం చెల్లించేవారు. అలాంటిది ఆమెనే స్వయంగా బాబా ఎదుట గానం చేసేందుకు ముందుకొచ్చింది. ఇదంతా అవతారుని లీల కాక మరేమిటి!!

ఆ పిదప తాను రోజూ బాబా చిత్రపటం ఎదుట ఆలాపిస్తున్న భజన కీర్తనని ఎంతో మధురంగా ఆలాపించింది. ఆమె అలా పాడుతుంటే ఆమె చెక్కిళ్ళపై నుండి కన్నీటి ధార ఆగలేదు. బాబా తను ఉపయోగించే చేతి రుమాలును కన్నీటిని తుడుచుకునేందుకై ఆమెకిచ్చారు. బాబా ఎంతో ఆనందించారు.

బాబావారి మెప్పు పొందిన గాయని ఆమె. ముందుగా ఒక పాట పాడేందుకు

అనుమతి ఇచ్చినా, అదనంగా మరో మూడు పాటలు హృద్యంగా పాడిందామె. ఆ తర్వాత బాబా మాట్లాడుతూ నేను ఫకీరుల్లో ఫకీరుడినన్నారు. చక్రవర్తుల్లో మహా చక్రవర్తినని పేర్కొన్నారు.

అవును బాబా! అందులో సందేహం ఏమీ లేదని బేగం అక్తర్ విధేయతతో జవాబిచ్చింది. గురుప్రసాద్‌లో ఏర్పాటు చేసిన 'కచేరీకి' పారితోషికం ఎంత ఇవ్వాలి? అని బాబా ఆమెను ప్రశ్నించగా "I Want Nothing - Except Love". నీ ప్రేమ నాపై వుంటే చాలు బాబా, నాకింకేమీ వద్దని వినమ్రంగా జవాబిచ్చింది ఆమె.

ఈ మాటతో బాబా సంతోషించారు. బేగంతో పాటు ఆమె కుమార్తె, తబలా ఆర్టిస్టు కామత్ కూడా వచ్చారు. ఈ బృందం తమతో రెండు పెద్ద పూలదండలు బాబా మెడలో వేయాలని తీసుకొచ్చారు. ఆ రెండిలో ఒకటి బేగంజీ తన కుమార్తె కివ్వాలనుకుంది. కానీ, ఆ సమయంలో ఆమెనే ఆ రెండు పూదండలూ తన చేత్తో, భక్తితో అవతారుని మెడలో వేసేసింది. బాబా ఆమెతో – నీ గానం నన్నెంతో సంతోషపరిచిందన్నారు.

అది నా భాగ్యం బాబా అన్నదామె. తిరిగి వెళ్ళిపోతూ ఆమె బాబా పాదాలపై తన శిరస్సు వుంచింది. ఆమె అలా చాలాసేపు వుండిపోయింది. బాబా ఆమెకు తన ఆశీస్సులు అందజేశారు. ధన్యులు సుమండీ – బేగంజీ!!

## మెహెర్‌బాబా 71వ జన్మదినోత్సవం

ఆ రోజుల్లో 1964 డిసెంబరు 17 నుండి వరుసగా 71 రోజులపాటు అంటే 1965 ఫిబ్రవరి 25 వరకు బాబా ప్రేమిక సహవాస్‌లు నిర్వహించారు.

మచిలీపట్నంలో 71 రోజులపాటు బాబా సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఒక ఉచిత ఆరోగ్య శిబిరం కూడా బాబా పేరిట నిర్వహించారు. ఎందరో పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా బందరు ప్రేమికులకు బాబా ఒక సందేశం ఇలా పంపారు.

Feed ME and cloth ME and fend ME in the Poor.

**హైదరాబాద్** ప్రేమికులకు బాబా ఒక సందేశం**లో 1965 ఫిబ్రవరి 25 ఇలా అన్నారు.** I give My love and blessing to you & all My lovers in Hyderabad & Sec'bad that each of the seventy-one days of your programme may be a blossom on the tree of My love.

**కాకినాడ ప్రేమికులను ఉద్దేశించి**

I give My love blessing to you and to all lovers in Kakinada and elsewhere that each of the Seventy-One days of your programme be a flower of your love to be woven into a garland for My seventy first birthday.

# 1965 ఫిబ్రవరి 25

1965 ఫిబ్రవరి 25, 71వ పుట్టినరోజు సందర్భంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్ నుండి ప్రచురిస్తున్న God-Man పత్రికకు మెహెర్‌బాబా ఒక సందేశం ఇలా పంపారు.

No sooner do you begin to love those whom you cannot love, you begin to love me as I should be loved. ఇదేమంత సులభమైన విషయంకాదు.

**– ఐతే, సాధకమున బనులు సమకూరు ధరలోన అన్నారు కదా!!**

1965 ఫిబ్రవరి 25, ఆ రోజున ఉదయాన్నే ఒక అనుకోని అతిధి శ్రీమతి బేగం అక్తర్ మెహెరాజాద్ వచ్చారు. ఫిబ్రవరి 25న బాబా జన్మదినం సందర్భంగా అహ్మద్‌నగర్ బాబా సెంటర్‌వారు ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో శ్రీమతి బేగంజీ ఘజల్సు కచేరీ ఏర్పాటు చేశారు. స్థానిక గాంధీ మైదానంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వచ్చిన ఆమె నేరుగా మెహెరాజాద్‌కు బాబా దర్శనార్ధం వచ్చింది. అలా వచ్చిన బేగం అక్తర్ తన ప్రేమపూర్వకంగా రెండు కీర్తనలు బాబా ఎదుట పాడతానని అభ్యర్ధించింది. ఆమె ఎంతో దూరం నుండి ప్రయాణం చేసి బాగా అలసి వున్నా ఎంతో చక్కగా బాబా ఎదుట గానం చేసింది.

అహ్మద్‌నగర్‌లో ఒక కవి పండితుడు అఫ్సర్ సేమానీ బాబా కోసం క్రొత్తగా ఒక ఘజలు రాశాడు.

ఆ ఘజల్ని శ్రీమతి బేగం అక్తర్ ఎంతో మధురంగా ఆలాపించింది. ఆ గానామృతాన్ని ఆస్వాదించిన అవతారుడు, నీవు పాడిన మధుర కీర్తనలు నా పుట్టినరోజు కానుకగా వుందన్నారు. నీ గాత్రం ఆపాతమధురం. నీకు మరొకరి సాటిలేదని బాబా బేగంజీని అభినందించారు.

బాబా! ఇదంతా నీ కరుణ – నీ ప్రేమ తప్ప మరొకటి ఏమీకాదని ఆమె వినయంగా బాబాతో అన్నది. ఆదరిమిలా, ఆమె ఎంతో దూరం నుండి ప్రయాణం చేసి వచ్చిందని – వెళ్ళి కొంతసేపు విశ్రాంతి తీసుకోమన్నారు. దాంతో, ఆమె రెండు కళ్ళలో నీళ్ళు చిప్పరిల్లాయి. 'నీ పాదాల చెంతనే నేను సేద తీరగల్గుతాను' బాబా అని ఆమె అన్నది.

ఆ రోజు రాత్రి (ఫిబ్రవరి 25) బాబా జన్మదినోత్సవం సందర్భంగా అహ్మద్‌నగర్‌లోని గాంధీ మైదాన్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో బేగం అక్తర్ సుమారు 7 వేల మంది ఎదుట అవతారుని కీర్తనలు ఆలాపించింది.

హమీర్‌పూర్ బాబా ప్రేమికుడు పుకార్‌జీ అవతారుని సందేశాలపై విశేష ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమానికి మెహెరాజాద్ నుండి ఖోర్షేద్, ఆర్నవాజ్, నారిమన్, ఆదీ జూనియర్, మెహెర్వాన్ జెస్సావాలా, తదితరులు హాజరయ్యారు.

# చిరస్మరణీయం

**యం. ఆర్. ధాకేఫాల్కర్ మెహెర్‌బాబా నిర్వహించిన స్కూల్లో (1926-27) టీచర్‌గా పనిచేశాడు. 1927 ఫిబ్రవరిలో మెహెరాబాద్‌లో నిర్వహించిన మెహెర్‌బాబా జన్మదినోత్సవ విశేషాలను ఆయన స్వీయరచనలో ఇలా వివరించారు. ఆనాటి సంగతులు నేటి మెహెర్‌బాబా పాఠకులకు ప్రత్యేకం. దయచేసి పరిశీలించండి. ఇకపై ధాకే మాటల్లోనే.. ..,**

ఆ ఏడాది పార్శీ పంచాంగం ప్రకారం బాబా జన్మదినం 1927 ఫిబ్రవరి 18న ఎంతో వైభవంగా జరిపారు. మెహెరాబాద్‌లో తెల్లవారుఝాముననే లేచి బాబాకు ఆయన శిష్యులందరం ఆరతి ఇచ్చి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసాం. ఆ రోజుల్లో ప్రతి వాళ్ళూ ఉదయం 4 గంటలకే లేచి చన్నీటితో స్నానం ముగించుకొని, 6 గంటలకు టీ తీసికొని, 6.30 గంటలకు నియమిత విధులకు వెళ్ళాలనే నియమం ఉండేది.

నాడు ప్రతి శిష్యుడు బాబా భుజాల మీద, వీపు మీద ఒక నిండు పాత్రతో వేడినీరు పోసి, స్నానం చేయించడానికి అనుమతించారు. మేము సుమారు వంద మంది ఉన్నాం. నా వంతు రాగానే నేను పాత్రతో వేడినీరు తీసుకొన్నాను. బాబా ఒకపెద్ద చెక్క స్టూలుపై కూర్చొని ఉన్నారు. తెల్లని నిక్కరు మాత్రం ధరించి ఉన్నారు. శరీరంపై మరే అచ్ఛాదన లేదు. ఆయన పొడవాటి బంగారు ఛాయ శిరోజాలు భుజాలపై వ్రేలాడు తున్నాయి. మృదువైన తెల్లని చర్మం కాంతులీనుతోంది. ఆయన ముఖం కాంతివంతమై నవ్వులను వెదజల్లుతోంది. కళ్ళు దివ్య తేజస్సుతో నిండి వున్నాయి. నేను ఒక పాత్రతో నీరు ఆయన వీపు మీద పోశాను. కొంచెం చలిగా వున్నదని, మరియొక పాత్ర నీరు తన ఛాతీపై పోయమని నాతో బాబా అన్నారు. ఆయన అనుజ్ఞతో మూడోసారి కూడా నీరు ఆయన తొడలపైన, మోకాళ్ళపైన పోసి మిగిలిన నీటితో ఆయన పాదాలు అభిషేకించాను. అనంతరం ఆయన పాదాలకు ప్రణామం చేసాను. బాబా నా భుజాలు స్పృశించారు. నేను గది బయటకు వెళ్ళాను. మిగిలిన వారు ఒక పాత్ర నీరే పోశారు. నాకు మాత్రం రెండు పాత్రలు అధికంగా పోసే అదృష్టం లభించింది.

బాబా ధవళ వస్త్రంలో చక్కగా అలంకృతులయ్యారు. పూవులతో చేసిన కిరీటము ఆయన శిరస్సుపై అలంకరించారు. అందమైన పూలమాల ఆయన గళానికి శోభని చ్చింది. ఆయన చేతులు, మణికట్టు పూలమాలతో అచ్ఛాదింపబడ్డాయి. చేతిలో ఒక మురళి తీసుకొని ఆయన శ్రీకృష్ణుని పోలి ఉన్నారు. ముఖం దివ్య కాంతితో మెరిసిపోతున్నది. ఆయన **'అహం బ్రహ్మాస్మి'** స్థితిలో ఉన్నారనిపించింది. ఎంతో ఉల్లాసముగా ఉండి, దివ్యమైన చిరునవ్వులు వెదజల్లుతున్నారు. చుట్టుప్రక్కల గ్రామాల నుండి పెద్ద పెట్టున ప్రజలు తరలి వచ్చారు. పూణే నుండి మరి ఇతర ప్రాంతాల నుండి మరికొంత మంది బాబా శిష్యులు వచ్చారు. పూణే నుండి బాబా తల్లి షిరీన్‌మాయి కూడా వచ్చింది. బాబాకు ఆరతి ఇచ్చే సమయంలో ఆమె, "మేర్వాన్ .. నేడు నీ జన్మదినోత్సవం రోజున నీవు

భగవంతుడుగా ఆరాధింపబడుచున్నావు. ప్రతి ఒక్కరు నిన్ను భగవంతునిగా స్వీకరించి, నీకు మోకరిల్లుతున్నారు. నేను నీకు తల్లిని. నీ నుండి ఒక వరం కోరుతున్నాను" అంది. బాబా ఆమె వైపు తిరిగి, "ఏమిటమ్మా అది?" అని అడిగారు.

"నీ తండ్రి, నేను అనేక సంవత్సరాలుగా వైవాహిక జీవితం ఆనందంగా గడుపుతున్నాము. మేము సంతానవంతులమై సుఖమైన కుటుంబముగా ఉన్నాము. నీవు కూడా వివాహం చేసుకొని, సంతానవంతుడవైతే ఎంత బాగుంటుంది! నీ పిల్లలు నీ భుజాలపైన, ఒడిలోను ఆడుకుంటూ ఉంటే చూడాలని నాకెంతో కోరికగా ఉంది."

"అమ్మా, సంసారిక ప్రపంచంలో కుసుమించిన పుష్పము నీవు. ఎంతో అదృష్టవంతురాలివి. రామునికి కౌసల్యవలె, కృష్ణునకు యశోదవలె, జీసస్‌కు మేరీమాత వలె అదృష్టశాలివి. నీవు భగవంతునకే జన్మను ఇచ్చావు. నీవు ఆరాధ్యురాలవు. ఆదర్శవంతమైన స్త్రీవి. అటువంటి తల్లికి ఎవరు విధేయులై ఉండరు?" అన్నారు బాబా.

అది విని మేమంతా సద్గురువైన బాబా వివాహం చేసుకొంటారనుకున్నాం.

బాబా ఇంకా ఇలా అన్నారు. "అమ్మా! వివాహానికి ఒక పురుషుడు, ఒక స్త్రీ కలసి ఇద్దరు వ్యక్తులుండాలి. నేను భగవంతునిచే ఏ స్థితికి కొనిపోబడ్డానో నీకు తెలియదు. ఉన్నది నేనొక్కడేనని, మిగిలినదంతా అస్థిత్వము లేనిదనే సాక్షాత్కారానుభవం భగవంతుడు నాకు ప్రసాదించాడు. నేను ఏకాకిని. నేను వినా మరొకరు లేరు. సినిమా తెరపై అందమైన స్త్రీలను, బాలికలను మీరు చూస్తారు. సినిమా అయిపోగానే వట్టి తెర మాత్రమే మిగులుతుంది. ఆ విధంగా మీరంతా ఛాయామాత్రులనే అనుభవం నాది. అటువంటప్పుడు ఛాయను నేనే విధంగా వివాహం చేసుకొనగలను? అంతేకాక, ఈ మానవాళి, ఈ విశ్వమంతా కూడా నాలోనే యున్నది. మానవులు సంతోషంగా ఉన్నప్పుడు, వారు నాలోనే సంతోషిస్తున్నారు. కావున వారందరి సామూహిక వైవాహిక జీవితసౌఖ్యము నేను పొందుచున్నాను. అదే నా ఆనందం. అందుచేత అమ్మా, నేను ఎలా వివాహం చేసుకొనగలను?" అని అన్నారు.

అది విని షిరీన్‌మాయి కంట నీరు పెట్టుకొని ఇలా అర్థించింది. "మేర్వాన్! నీవు చెప్పేది నాకేమీ బోధపడటం లేదు. నీ ఇష్టప్రకారం చెయ్యి నాయనా! నీవు చేసేది సరియైనదని ఇప్పుడు నేను విశ్వసిస్తున్నాను. దయతో నీ తల్లిదండ్రులపైన, మన కుటుంబంపైన నీ అనుగ్రహం చూపించు."

వెంటనే బాబా నన్ను పిలచి ఆరతి ఏర్పాటు చెయ్యమన్నారు. మెహెరాబాద్‌లో ప్రతిరోజు సాయంకాలం ఆరతి ఇచ్చే బాధ్యత నాకు ఇవ్వబడింది. నేను కర్పూరము, వత్తులు వెలిగించాను. మేమంతా కలసి బాబాకు ఆరతి ఇచ్చాము. ఆయన పాదస్పర్శచేసి, ఆకులలో మధురమైన ప్రసాదాలు తీసుకొన్నాము. ఆ రోజు మధ్యాహ్నం సుమారు పదివేల మందికి తృప్తిగా భోజనాలు ఏర్పాటు చేసారు. సాయంకాలం భజన కార్యక్రమాలతో ఆ రోజంతా మేము విశ్రాంతి లేకుండా గడిపాము. రాత్రి సమయానికి పూర్తిగా అలసిపోయినప్పటికీ మానసికంగా ఎంతో ఆనందంగా ఉంది.

# విధేయతలోనే - అవిధేయత



మెహెర్‌బాబా ప్రేమికులు శ్రీ ఎన్.వి.రమణయ్య, గుంటూరు బాబా ప్రేమికులకులందరికీ సువరిచితులే. విశాఖపట్నం వాస్తవ్యులు శ్రీ త్రినాధ్ రథో గారికి శ్రీ రమణయ్య చాలా దగ్గర బంధువులు. శ్రీ రమణయ్య ద్వారానే

తాను బాబా పరిధిలోకి వచ్చానని శ్రీ రథో తరచు చెప్తుండేవారు. ఐతే, బాబా జన్మదినోత్సవ సందర్భంగా శ్రీ రమణయ్య విషయంలో జరిగిన ఒక యదార్ధ సంఘటనను శ్రీ రథో ఇలా చెప్పారు.

ఇకపై రథో గారి మాటల్లోనే దయచేసి పరిశీలించండి.

మెహెర్‌బాబా పట్ల రమణయ్యకు ఎంత భక్తిభావం ఉందో అందరికీ తెలుసు. ఆయన రాములవారి దగ్గర హనుమంతుడులాంటివాడు. రమణయ్య వ్యక్తిగతంగా ఎంతో మంచివాడే కాదు – మొండివాడు. ఒక్కొక్కప్పుడు తాను పట్టిన కుందేటికి మూడు కాళ్ళేనంటాడు. ఇంతకీ ఏమంటే, – అది ఏ సంవత్సరమో గుర్తు లేదు. ఒకసారి మెహెర్‌బాబా పూణేలో – గురుప్రసాద్‌లో వున్నారు. అది ఏకాంతవాస సమయం. మండలి సభ్యుల్ని కూడా బాబా దర్శనార్ధం అనుమతించని సమయమది. ఆ సమయంలో ఫిబ్రవరి 25న బాబా జన్మదినం కావడంతో రమణయ్య పూణే చేరుకున్నాడు. తెల్లవారితే బాబా జన్మదినం కాగా, ముందురోజుననే మెహెర్‌బాబా కోసం నిలువెత్తు గులాబీదండ ఒకటి కొనుగోలు చేసి, పొద్దుబోయాక గురుప్రసాద్ దగ్గరకి వెళ్ళి ఏరుచ్‌ని కలిసాడు. రమణయ్యను చూస్తూనే ఏరుచ్ అవాక్కయ్యాడు. ఏమిటిలా వచ్చావు? బాబా ఏకాంతవాసంలో ఉన్నారన్న సంగతి తెలియదా? అని ప్రశ్నించాడు. బాబా ఎవరినీ అనుమతించరని తెలుసుకదా? అని తిరిగి ఏరుచ్ రమణయ్యతో అన్నాడు. రమణయ్య కూడా ఏమాత్రం కంగారు పడకుండా, "నేనేమి బాబా దర్శనం కోరడం లేదు. బాబా ఏకాంతవాసంలో ఉన్నారన్న సంగతి తెలుసు. రేపు ఆయన పుట్టినరోజు.

కాబట్టి, మీలో ఎవరో ఒకరు తెల్లవారుఝామున ఆయనకి బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పడానికి వెళతారు కదా! అలా వెళ్ళినవారు, ఎవరైతే వెళతారో, వాళ్ళు ఈ పూలమాలను ఆయన

మెడలో వేస్తే చాలు. ఆ సమయంలో, ఎవరైతే బాబా దగ్గరకు వెళ్తారో వాళ్ళ చేతికి ఈ పూలదండ ఇవ్వాల్సిందని ఆయన కోరాడు. నాకు బాబాను దర్శించాలనే కోరిక లేదు. బాబాకు నేను ఈ పూలదండ తీసుకువచ్చానన్న సంగతి కూడా చెప్పవల్సిన పన్లేదు. ఇది భగవంతునికి నా చిరుకానుక మాత్రమేనని సందర్భోచితంగా, వినమ్రంగా ఏరుచ్‌తో అన్నాడు. ఇది ఉభయులకూ బాగానే ఉందనుకున్నారు.

అంతటితో రమణయ్య ఏరుచ్ దగ్గర సెలవు తీసుకున్నాడు. బాబా జన్మదినం రోజున తెల్లవారుఝామున ఐదు గంటలకు మెహెరామాయి – బాబా మెడలో ఈ పూలదండను వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసింది. దాంతో బాబా పూలదండను చూపిస్తూ, చాలా బాగుంది? ఎక్కడ్నుంచి తెప్పించారని ప్రశ్నించారు. మెహెరామాయికి ఈ విషయాలన్నీ ఏం తెలుసు! ఏరుచ్‌ని అడిగితే – ఫలానా – గుంటూరు రమణయ్య తెచ్చిన వైనం తెలిపాడు. బాబా అతడ్ని పిలిపించండని ఆదేశించారు. అయితే, అతను రాత్రి పూలదండ ఇచ్చి వెళ్ళిపోయాడని ఏరుచ్ చెప్పాడు. అతను ఎక్కడున్నా సరే వెతికి పట్టుకోమని బాబా ఆదేశించడంతో ఏరుచ్‌కి ఇదొక పెద్ద సమస్యగా మారింది.

అంత పెద్ద పూణే నగరంలో ఎక్కడని ఈతడిని వెతికి పట్టుకోవాలి? అని ఏరుచ్ సంశయంలో గురుప్రసాద్ భవనం బయటకొచ్చి చూసేసరికి రమణయ్య వచ్చిన కార్లో అలా కూర్చునే ఉన్నాడు. రాత్రంతా అలా కారులోనే జాగరణ చేశాడని తెలిసింది. నాకు తెలుసు ఇలాంటిదేదో జరిగి బాబా నాకు తప్పక దర్శనమిస్తారన్న నమ్మకం నాకుందని రమణయ్య మాతో అన్నారు.

బాబా పిలుస్తున్నారని చెప్పి రమణయ్యను ఏరుచ్ బాబా దగ్గరకు పంపాడు. బాబా రమణయ్యను చూస్తూనే సంతోషంతో **"పూలదండ బాగుంది"** అని ఏరుచ్ ఎదుటనే అన్నారు. అంతేకాదు, నీవు తెచ్చిన ఈ పూలదండ, నా మెడలోనించి తీసి, తిరిగి నీ చేతులతోనే వేయమని బాబా తన సంజ్ఞలతో చెప్పారు. రమణయ్య ఆనందానికి అవధులు లేవు. అవతారుడి మెడలో గులాబీ పూలమాల వేసి, ఆయన ఆలింగనం అందుకున్నాడు. ఇదంతా ఏరుచ్ సమక్షంలోనే జరిగింది. "రమణయ్య – నాకేసి క్రీగంట చూస్తూ, తానే విజయం సాధించినట్లు ఫోజిచ్చారని" ఆ తర్వాత బాబా ప్రేమికులతో మాట్లాడుతూ ఏరుచ్ చమత్కరించారు.

ఇంతకీ బాబా ఏకాంతవాసంలో ఉన్నారని తెలిసి ఎలా వెళ్ళావయ్యా? ఇది బాబా ఆదేశాలపట్ల అవిధేయత (Disobedience) కాదా? అని నేను ప్రశ్నిస్తే – నవ్వుతూ 'తండ్రికి – పిల్లవాడికి మధ్య అవిధేయత – విధేయత ఏమిటి?' అని కొట్టిపారేసాడు మా రమణయ్య. మెహెర్‌బాబా పట్ల రమణయ్యకున్నది స్వచ్ఛమైన, గాఢమైన ప్రేమ!! అదేదో మెహెర్‌బాబాకు – రమణయ్యలకే బాగా తెలుసు. మెహెర్‌బాబాలో భగవంతుడ్ని చూసి తరించిన వ్యక్తి – రమణయ్య. ❃



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: – భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) – తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

హాస్టల్ ప్రారంభోత్సవం మీ చేతుల మీదుగానే జరగాలని స్కూలు యాజమాన్యం బాబావారిని కోరింది. ఆ కోరిక మేరకే బాబావారీవాళ నగర్‌కి వెళ్ళింది. వెళ్ళేటప్పుడు కాలినడకన వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు లారీలో వచ్చారు. ఎప్పటిలా బాబావారి వెంట, మండలివారు కొందరు నగర్ యాత్ర చేశారావాళ. వాళ్ళు కూడా బాబావారితో పాటే లారీలో వెనక్కి వచ్చారు. నాసిక్ నుంచి తిరిగి వచ్చాక బాబావారు పిల్లలతోనే ఎక్కువసేపు వుంటున్నారు. వాళ్ళ అవసరాలని తామే దగ్గర వుండి చూస్తున్నారు. రోజూ ఏదో ఒక ఆధ్యాత్మిక సంగతిని పిల్ల గోపికలకి అర్థమయ్యేలా చాలా ఓపికగా చెప్తున్నారు.

తాము దేశాటనకి వెడితే పిల్లల సంగతి ఏమిటి? వాళ్ళని ఇళ్ళకి పంపేస్తే, వాళ్ళు వుండలేరు. ఇక్కడి ఆధ్యాత్మిక వాతావరణంలో భగవత్ప్రేమామృతం త్రాగుతున్న వీళ్ళ పరిస్థితి, ఇంటికి పంపేస్తే నీళ్ళలో నించి బయట పడేసిన చేపల లాగా వుంటుంది. మరి, అలా అని, వాళ్ళని ఇక్కడే మెహెరాబాద్‌లో వుండనిస్తే, వాళ్ళ అమ్మా – నాన్న ఊరుకోరు. బాబావారు లేనప్పుడు మా పిల్లలు ఎందుకు అక్కడ, తీసుకుపోతాం అంటారు.

బాబావారి దగ్గర చదువుకోడానికి వచ్చిన పిల్లల్లో ఎక్కువ మంది హిందువులు. బాబా వంటి గొప్ప ఆధ్యాత్మిక గురువు దగ్గర చదువు కుంటే, పిల్లలు బాగుపడతారనిపించింది పెద్దలకి. అందుకనే బాబావారు స్కూలు తెరిచారని తెలియగానే, తమ పిల్లల్ని మెహెరాబాద్‌కి తీసుకువచ్చారు. మా పిల్లల్ని మీ చేతుల్లో పెడ్తున్నాం. వాళ్ళ ఆలనా పాలనా మీదే బాధ్యత అన్నారు. అంటే బాబావారిపై ఎంతో భరోసాతో వున్నారు. మరి బాబావారు ఇక్కడ లేకపోతే వాళ్ళకి తీసుకుపోవాలనుకోవటం సహజం.

అటు పిల్లల మనస్సు నొప్పించ కుండా, ఇటు పెద్దలని గాభరా పెట్టకుండా వుండాలంటే ఏం చేయాలి?. ఇది చిక్కు ప్రశ్నగా కనిపించింది చాలా మందికి. ఏం చేయాలో పాలుపోలేదు మండలి వారికి. ఎప్పటిలా బాబావారి పైనే భారం వేశారు. బాబా ఏం చెపితే అలా చేద్దామనుకొన్నారు. దిక్కుతోచని వారికి దిక్కులు చూపించడమే నా పని అన్నట్లు, బాబావారు ఓ సలహా ఇచ్చారు. పిల్లలు ఇక్కడ ఖాళీగా వుండటం దేనికి. అక్కరకి వచ్చే ఏదైనా పని నేర్పితే బాగుంటుంది అన్నారు. ఏపని నేర్పితే బాగుంటుంది?

ప్రింటింగ్ పని బాగుంటుందన్నారు. ప్రింటింగ్ తెలిసిన వాళ్ళెవరూ మండలిలో లేరు. నగర్‌లో అయితే ప్రింటింగ్ ప్రెస్‌లున్నాయి కానీ, పిల్లలను రోజూ అంత దూరం పంపటం నచ్చలేదు ఎవరికీ. బాబావారే తరుణోపాయం చెప్పారు. విష్ణునీ, జాల్‌నీ ప్రింటింగ్ పని నేర్చుకురమ్మన్నారు. మీరు నేర్చుకొన్న విద్యని పిల్లలకి నేర్పమన్నారు.

మన పిల్లలకే ప్రింటింగ్ పని వస్తే, మనమే ఒక ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకోవచ్చు ఇక్కడ అన్నారు. ఈ ఆలోచన అందరికీ నచ్చింది. బాబావారు చెప్పినట్లే చేస్తామన్నారు విష్ణు, జాల్. వీరు ఇద్దరినీ మెహెర్ ప్రింటింగ్ ప్రెస్‌కి పంపారు. నగర్‌లో మంచి పేరున్న ముద్రణాలయం ఇది. నెల రోజులు అక్కడ పని నేర్చుకొన్నారు.

ఏప్రిల్ 22వ తేదీన బాబావారు మరో తూరి నాసిక్ వెళ్ళారు. స్త్రీ మండలితో మూడురోజులున్నారు. మే ఒకటవ తేదీన ఛాన్జీ, రావ్ సాహెబ్ వచ్చారు మెహెరాబాద్‌కి. పూరకరారు మహానుభావులు అని కదా అంటారు. వీరిద్దరూ పూరికెనే రాలేదు. బాబావారి సలహా కోసం వచ్చారు. పర్షియాలో కావాలి సలహా వీళ్ళకి. సంగతి ఇదమిద్ధంగా తెలీదు కానీ, ప్రచురణలకి సంబంధించి సంప్రదించటానికి వచ్చారన్నది స్పష్టం, సుస్పష్టం.

మే రెండవ తేదీన ప్రేమాశ్రమం ఫ్యామిలీ క్వార్టర్లకి మారింది. పాఠకులకి తెలుసుగా ఫ్యామిలీ క్వార్టర్లు ఆరంగావ్‌లో వున్నాయి. ఇప్పుడు ఆ జాగాలో ఉచిత ఆస్పత్రి నడుస్తోంది. ఆ ఆస్పత్రిని పెట్టింది బాబావారే. దాన్ని సమర్థవంతంగా ఇటీవలి వరకూ నిర్వహించిందీ ఓ తెలుగు సోదరుడే. బాబా కార్యక్రమాల్లో తెలుగువారిది ప్రత్యేక పాత్ర ఆనటానికి ఇదొక ఉదాహరణ – అనువాదకుడు.

దిగువ మెహెరాబాద్‌లోనో, ఎగువ మెహెరాబాద్‌లోనో వుండటం ఒక ఎత్తు. ఆరంగావ్‌లో వుండటం ఇంకో ఎత్తు. అందుకనే ఫామిలీ క్వార్టర్స్‌లో వుండమంటే ప్రేమాశ్రమం పిల్లలకి మనస్కరించలేదు. మేము ఏంచేశామని మాకీ శిక్ష అని కుమిలిపోయారు. బాబావారేది చేసినా మన మంచికే కదా అని మనస్సు దిటవు చేసుకొన్నారు. కాసేపటికి బాబావారొకటే చెప్పారు. ఈ పిల్ల గోపికలకి. "మీరు ఇక్కడే వుండండి. ఎప్పటిలా చదువుకోండి. నేను తిరిగి వచ్చేవరకు అన్నీ యధాతథంగా జరగాలి. వేటిల్లోనూ లోపం రాకూడదు. నేను వచ్చేస్తాను తొందరగానే. దూరం వెడుతున్నా కాబట్టి వెంటనే రాలేను. నేను వచ్చే వరకూ ఓపిక పట్టాలి మీరు అని బాబా ప్రేమాశ్రమం గోపికలని సముదాయించారు.

ప్రింటింగ్ పని విష్ణు దగ్గర నేర్చుకోండి, నేర్పుతాడు అన్నారు. ముద్రణలో విష్ణు సుశిక్షితుడు కదా. ఏదైనా ముద్రణ చేయాలంటే అప్పట్లో ముందు అక్షరాలని పొందికగా ఓ దాని ప్రక్క మరొకటి అమర్చాలి. ఏ అక్షరానికి ఆ అక్షరం కదలకుండా చూడాలి. ఇలా మొత్తం అక్షరాల సమాహారం తయారయ్యాక అవి కదలకుండా బిగించి పెట్టాలి. ఈ పని చాలా కష్టం. ఎంతో ఓపిక కావాలి. పిల్ల గోపికలకి ఆసక్తి వుంది. ఓపికా వుంది. మరి

ఇంక ఆలస్యం దేనికి, కొత్త విద్యకి శ్రీకారం చుట్టారు. ఇంతకూ ప్రింటింగ్ సరాంజామా ఎక్కడిదని మీ ధర్మ సందేహం. అయితే వినండి. నగర్ నుంచి వస్తూ తెచ్చాడు వాటిని విష్ణు. ఇది పిల్లల కథ. మరి పెద్దల కథ మాట ఏమిటి? దేశాటనకి బయలుదేరతామని బాబావారు అంటుంటే గుండెల్లో గుబులు బయలుదేరింది పురుష మండలికి.

ఏ ఊరు వెడతారు. ఎలా వెడతారు. ఎప్పుడు బయలుదేరతారు. ఎవర్ని వెంటతీసుకు వెడతారు. బాబావారు తీసుకు వెళ్ళకపోతే ఏంచేయాలి? ఇన్ని ప్రశ్నలు వాళ్ళని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పోనీ బాబావారినే అడిగితే సరిపోదు. మనలో మనమే మధనపడటం దేనికి అన్న ఆలోచన మాత్రం వచ్చిన దాఖలా లేదు. ఎందుకు లేదూ అంటే, వారంతా బాబావారికి తమ జీవితాన్ని అంకితం చేసిన ధన్యులు కాబట్టి. బాబావారి నామం నేల నాలుగు చెరగులా వినిపించకపోయినా బాబావారే పరబ్రహ్మ పరమాత్మ అని మనసా వాచా నమ్మి, ఆయన వెంట కదిలి వచ్చిన అదృష్టవంతులు వీరు కాబట్టి. వీళ్ళు మామూలు వ్యక్తులు కాదు. బాబావారు ఏమి చెబితే అది ఎదురు ప్రశ్న లేకుండా చేయగల మనస్తత్వం వారిది. అందుకనే బాబావారి సేవలోనే వారికి పరమార్థత లభించింది.

అయితే సేవలో పరిపూర్ణత 1929 నాటికి రాలేదు మండలివారికి.

ఆ సంగతి బైలీ పుణ్యమా అని మే ఐదున బడట పడింది.

'మీ ప్లాన్ తెలియక పురుషమండలి సతమతమవుతున్నారు. వాళ్ళకి విసుగుపుడ్తోంది. ఖాళీగా కూర్చోలేకపోతున్నారు. చిరాకు వేస్తోంది అని బైలీ బాబాకి చెప్పాడు.

బాబా: 'నిజంగా? నాకు తెలియదే? ఎవరూ చెప్పలేదే? ఇదే మొదటిసారి ఈ విషయం వింటున్నాను'. బైదుల్ని పిలవమన్నారు. అతనికి కబురు వెళ్ళింది. హుటా హుటిన బాబావారి సమక్షానికి అతను వచ్చాడు.

**బాబా:** నా యాత్ర వివరాలు ఇంకా ఖరారు చేయకపోవటంతో నీకు కష్టంగా వుందా? ఖాళీగా కూర్చోవడం ఇబ్బందిగా వుందా? చికాకు పుడ్తోందా నిజం చెప్పు!

**బైదుల్:** అబ్బే! అదేం లేదు బాబా.

**బాబా:** అలా అయితే సరే! విసుగు, చిరాకు, అసహ్యం లేనివాడు ఒకడున్నాడన్న మాట ఇక్కడ! ఒకటి రెండు రోజుల్లో అన్నీ సర్దుబాటవుతాయన్నారు. అంతటితో ఊరుకోలేదు. ఇంకో మాట చెప్పారు. ఆ మాట వింటుంటే అందరికీ కంగారు పుట్టింది.

'నేను మీకు కనబడకుండా పోతాను. ఎక్కడో వుంటాను. ఎవరికీ కనబడను. ఎంత ప్రయత్నించినా మీకు నేను దొరకను. నా అంతట నేను పదేళ్ళు బందీనవుతాను' అని బాబావారు అంటీ అంటనట్లు, ముట్టీ ముట్టనట్లు ఆచి తూచి మాట్లాడుతుంటే పాపం మండలివారికి ఏమీ పాలుపోలేదు. బాబావారిని నొప్పించామా? అన్న దిగులు పట్టుకొంది. తప్పుచేస్తే క్షమించమని మనస్సులోనే లెంపలేసుకొన్నారు.

అయినా బాబావారి కోపం తగ్గినట్లు లేదు. ఎందుకంటే ఓ వుతుకు వుతికేశారు.

ఇదిగో ఈ మస్తాన్‌ని చూడండి. కుర్రాడు మస్తు. వాడిని చూసిన ప్రతిసారీ నాకు ఎంతో ముచ్చట వేస్తుంది. వాడిని చూడగానే నా సంగతి మరచిపోతాను. మస్తాన్‌కి ఏదీ కావాలన్న కోర్కెలేదు, దేని గురించీ తపనా లేదు వాడికి. వీటన్నింటికీ అతీతం వాడి మనస్సు. మాయ ప్రభావం వాడిపై లేదు. అందుకనే హాయిగా మహారాజులా వుంటాడు. వాడి స్థితి ఎంత ముచ్చటగా వుందో? మరి మీరో, మీకు చీటికీ మాటికీ చిరాకు, అసహ్యం, ఎందుకో తెలుసా, మీ మనస్సు వల్ల! మీ మనస్సులో గుంజాటన వల్ల! మీ మనస్సు గందరగోళంలో పడటం వల్ల! ఈ స్థితి మీకు లేకుండా చేయాలన్నదే నా సంకల్పం అన్నారు. ఆ పనిలోనే వున్నానన్నారు.

మిమ్మల్ని గందరగోళంలో పడేసే ప్రవృత్తిని మీ మనస్సుల నుంచి సమూలంగా తీసేయాలి. నే చేస్తున్న పని అదే. కానీ మీకు నా పని విసుగు తెస్తోంది, చిరాకు పెడ్తోంది అని మండలివారిని ఓ దులుపు దులిపేశారు. బైలీ మాటపట్టుకొని మీరు మమల్ని అందర్నీ కడిగేసి ఆరబెడుతున్నారు. అన్యాయం బాబా ఇది. మాకే విసుగూ, చిరాకు లేవు. ఆ వున్నదంతా బైలీ మహాశయుడికే. మీ చిన్ననాటి నేస్తానికే అని చెప్పాలనుకొన్నారు. అయినా చెప్పలేదు. సద్గురువు మాట వినడమే కానీ ఎదురు చెప్పకూడదన్న పాఠాన్ని మెహెరాబాద్‌లో అడుగు పెట్టినప్పుడే తెలుసుకొన్నారు.

సద్గురు తిట్లు దీవెనలు తప్ప మరొకటి కాదనీ తెలుసు వాళ్ళకి. వాస్తవాలు ప్రభువుకి తెలియకపోతే కదా. ఆయన ఏమని అన్నా, ఏమి చేసినా దానికి ఏదో పరమార్థం వుంటుంది అని మనస్సులోనే రాజీపడ్డారు.

చీమ చిటుక్కుమన్నా వినిపించే పరంధాముడికి బైలీ నిర్వాకం తెలియకపోతే కదా! అందుకనే చిన్నప్పటి స్నేహితుడిని కూడా వూరుకోలేదు. చివాట్లు పెట్టారు. ఏదైనా ఇబ్బంది వుంటే చెప్పు. నీ గోడు వినిపించు. తప్పులేదు వింటాను. అంతే తప్ప నీ మనస్సులో మాట అందరి నోటి మాటగా చెప్పకు ఎప్పుడూ. అదేమీ మంచి పద్ధతి కాదు అని చురకలు వేశారు. అలానే బాబా! అన్నాడు బైలీ, తప్పు చేయటం, తప్పయిపోయింది అని అనడం బైలీకి అలవాటయింది. అలా అలనాటి జడివాన వెలిసింది. వాతావరణం తేలికపడింది. మధ్యాహ్నం మూడింటికి బైదుల్, మెహెర్‌బాన్ పర్షియాకి బయలుదేరారు. దారా, సోరబ్ హన్సోటియా కూడా వాళ్ళ ఊరు వెడతామన్నారు. వీళ్ళ ప్రయాణానికి ముహూర్తం రేపన్నారు బాబా. అందుకని మర్నాడు మార్చి ఆరవ తేదీన ఇంటికి బండి ఎక్కారు వాళ్ళిద్దరూ. బాబావారి దేశాటన వివరాలు ఇంకా ఖరారు కాలేదు. ఎక్కడికి వెళ్ళాలి. ఎలా వెళ్ళాలి. ఏర్పాట్లు ఏం చేయాలి! ఇవే చర్చనీయాశం రోజూ, బాబావారి జోపిడీలో. ఆఘూ ఆలీ బాబాతో వెళ్ళాలని వుంది, ఆ మాటే చెప్పాడు. 'నువ్వు వద్దులే అన్నారు బాబా'. ఆఘూ ఆలీ ప్రవర్తనలో మార్పు వచ్చింది ఈ మధ్య. బాబావారినే ధిక్కరిస్తున్నాడు. బాబా వారి ఆదేశాలని పెడచెవిని పెడ్తున్నాడు. వాడు ఎంతగా అవిధేయత

చూపిస్తున్నా బాబావారు వాడిని ఎప్పటిలా లాలిస్తున్నారు. ప్రేమగా మాట్లాడుతున్నారు. తమ ఆలింగనం ఇస్తున్నారు. అక్కున చేర్చుకొని తల నిమురుతున్నారు.

మే ఆరవ తేదీన ఆఘూ ఆలీ మళ్ళా టలాయించాడు. బాబావారి ఆదేశం ఒకటి ధిక్కరించాడు. అయినా బాబావారు ఆ కుర్రాడిని మందలించలేదు. సరికదా క్షమించామన్నారు. ఎందుకు చేశారిలా! అలనాడు శిశుపాలుడి తప్పుల్ని శ్రుతి మీరేవరకూ కృష్ణుడు సహించిన వైనం గుర్తుకువచ్చింది. మరి మన ఆఘూ ఆలీ శిశుపాలుడు కాదే. పరమ భక్తుడే ఎందుకు చేస్తున్నాడీ తప్పుల్ని. కావాలని చేస్తున్నాడా! గ్రహపాటున చేస్తున్నాడా! బాబావారి ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆఘూ ఆలీకి తప్పులకి కూడా ఓ విశిష్ఠత వుందా. ఇవన్నీ ప్రశ్నలు. ఎప్పటిలా ఇవన్నీ శేష ప్రశ్నలే.

ఏ ప్రశ్నకీ మీరు అడిగిన వెంటనే జవాబు దొరకదని, అన్నట్లు ఆవేళ బాబావారేమన్నారో తెలుసా పాఠకమహాశయా! "సద్గురువు ఓ పిల్లాడికి లొంగిపోయాడు! ఏం కాలమహిమో ఇది అని వ్యాఖ్యానించారు.

మే 7వ తేదీన ఆలీ అక్బరులో కూడా అవిధేయత కనబడింది. ఈ పర్షియన్ కుర్రాడిని వెంటనే మందలించారు బాబా. చివాట్లు పెట్టారు. మనస్సు చివుక్కుమందో లేకపోతే తప్పు తెలిసివచ్చిందో తెలియదు కానీ, వాడు నాకు తినాలని లేదన్నాడు మధ్యాహ్నం. భోజనం చేయనని భీష్మించాడు.

బాబావారు చెప్పినా ఎంగిలి పడలేదు. భోజనం ముట్టక పోవడానికి కారణం కోపం కాదనీ, పశ్చాతాపం అనీ నెమ్మదిగా తెలిసింది. ఎలా తెలిసింది అంటారా, ఆలీ అక్బరు సందేశాన్ని రావ్ సాహెబ్ తెచ్చాడు కాబట్టి. తప్పయింది బాబా! నన్ను క్షమించు. మిమ్మల్ని కష్టపెట్టాను. ఇహ బుద్ధిగా వుంటానన్నాడు అక్బర్. ఎప్పటిలా మంచి బాలుడు అక్బర్ అనిపించుకొంటానన్నాడు. మాట తప్పనన్నాడు.

కుర్రాడు తన తప్పు తెలుసుకొన్నందుకు బాబావారు సంతోషించారు. ఆలీ అక్బరు మంచివాడు, మనస్సు వెన్న అందుకనే నా మజ్ను వీడు అంటాను. కానీ ఒక్కోసారి వాడి బుర్రకి ఏదో అవుతుంది. అప్పుడే ఇలా ప్రవర్తిస్తాడు. కొంచెం తలబిరుసు కూడా వాడికి. అయితేనేం నిజాయితీ వుంది వాడిలో అన్నారు బాబా.

రుద్ధ కంఠములు – రుధిర హృదయములు అన్న పుస్తకంలో ఆలీ అక్బరు ప్రస్తావన వుంది. ఆ పుస్తకం ప్రేమాశ్రమం, మెహెరాశ్రమం పిల్లల గురించే. రచయిత రమ్జూ అబ్దుల్లా. అక్బరు గురించి ఆయన స్పందన, ఆయన మాటల్లోనే...

ఆలీ అక్బరు ప్రేమ గొప్పది. విలక్షణమైనది. అతని సాటి మరెవ్వరూ లేరు. భగవత్ప్రేమ వాడిని పట్టి కుదిపేస్తోంది ఎప్పుడూ. అందుకనే వాడు ప్రశాంతంగా ఎక్కడా కూర్చోలేడు. ఏదో ఒకచోట నిలకడగా చాలాసేపు వుంటాడా అంటే అదీ వుండదు ఎప్పుడో కానీ. వాడిలో ఎప్పుడూ ఏదో వెలితి, తపన కన్పిస్తాయి. మెహెరాశ్రమంలో చేరాక .....

మార్పుయింది. ఇక్కడికి వచ్చినప్పుడు ఈ కుర్రాడికి భగవత్ప్రేమ, ఆధ్యాత్మికత పట్టేవికావు. ఆ విషయాలపై ఎవరైనా మాట్లాడుకొంటుంటే పట్టించుకొనేవాడు కాదు. ప్రక్కకి తప్పుకొనేవాడు.

దివ్యానుభూతుల పట్ల ఆసక్తి చూపలేదు అప్పట్లో. ధ్యానం, ఏకాగ్రతలకి వీలయినంత దూరంగా వుండేవాడు. మరి అటువంటి కుర్రాడిలో ఇంత మార్పు ఎలా వచ్చింది? అక్బర్ దైవోన్మత్తతలో పడ్డాడంటే దానికి కారణం ఆఘూ ఆలీ అనాలి. ఎందుకంటే, ఆలీని వాడి తండ్రి తీసుకుపోవడానికి వచ్చినప్పుడు వచ్చిందీ మార్పు. గుండె లోతుల్లో నుంచి దైవీ ప్రేమ పెల్లుబికింది. ఆ మహదానందంలో ఒళ్ళు మరచిపోయాడు. దుమ్ములో పడి దొర్లాడు. నీళ్ళ నుంచి బయట పడేసిన చేపలా తల్లడిల్లిపోయాడు. మెహెర్ దేవుడి ఆలింగనంతో ఊరట లభించింది. ఇహ అప్పటి నుంచీ ఆలీ అక్బరు భగవత్ప్రేమలో తేలుతున్నాడు. దీపం పురుగుల సంగతి తెలుసుగా మీకు. దీపం వెలుతురు కనిపించగానే అటుగా పరుగెడ్తాయి. వీడూ అంతే. బాబా అనే దీపం చుట్టూ తిరుగుతున్నాడు. దీపం పురుగులు దీపంపై పడి మంటని ఓం స్వాహా! అంటూ ఔపోసన పట్టాలనుకొంటాయి. మన అక్బరూ అంతే – తన చిన్నారి చేతులతో బాబావారిని చుట్టేసి గుండెల్లో దాచుకోవాలనుకొంటున్నాడు.

ప్రేమాశ్రమం పిల్లలతో బాబావారి ఆధ్యాత్మిక పని అతి విశిష్టమైనది. మానవ మాత్రులకి అంతుచిక్కని పని అది. మరి అంతటి మహత్తరమైన పని ఫలితాలు ఎలా వుంటాయో ఊహించడం కష్టం. ఈ ఫలితాలు ఈ జన్మలోనే కనబడవచ్చు ప్రేమాశ్రమం పిల్లల్లో. ఒక్క జన్మలోనైనా బయట పడవచ్చు. అదీ యిదీ కాకపోతే వాళ్ళు ఎన్నో జన్మలెత్తాక వ్యక్తం కావచ్చు. ఏది ఏమయినా, ఒకటి మాత్రం స్పష్టం.

వెలిగించాక ఒకసారి ప్రేమజ్వాల ఆరిపోదు ఎప్పటికీ మంట వేడి తగ్గవచ్చు గాలికి. కానీ, గాలినే కబలిస్తుంది ఓ రోజుకి భగభగ మంటున్న ప్రేమజ్వాల వేడి. అందుకనే పాఠకమహాశయా తెలుసుకో ఓ నగ్న సత్యాన్ని. ప్రియతముని మధుశాలలో మత్తు ఎక్కిన వారు ఏం చేస్తారో తెలుసా. నిర్దేశిత ఘడియ దగ్గరపడగానే 'మాయ' అనే గాలిని "ఓం స్వాహా!" అంటూ గుటుక్కున మింగేస్తారు. ఇదే ప్రియతముడిచ్చిన వరం వారికి.

స్కూల్లో చదువుకొంటున్న హిందువుల పిల్లలకి బాబావారు మే ఎనిమిదవ తేదీన కబురు పెట్టారు. వారు వెంటనే వచ్చారు. వీళ్ళు చాలామంది అంటరాని కులస్థులు. అంటరాని వారు హరిజనులనుకొనే కాలం కాదది. అంటరాని వారిని కలిస్తే వెలివేసే సమాజం అప్పటిది. కానీ బాబావారు చాలామంది అంటరాని వారిని దగ్గరకు తీసుకొన్నారు. వాళ్ళ పిల్లలకి చదువు సంధ్య చెప్పించారు. అలా కొత్త సామాజిక స్పృహకి నాంది పలికారు. ఇహ స్కూలు పిల్లల విషయానికి వస్తే, బాబావారు తమ దేశాటన గురించి చెప్పారు. రెండు మూడు నెలల్లో వాపసు వస్తానన్నారు. ఊరు నుంచి రాగానే పిలుస్తాను.

వెంటనే రావాలి సుమా అన్నారు. తాము లేనప్పుడు ఏం చేయాలో చెప్పారు. ఇంటి పట్టునే వుండమన్నారు. ఎక్కడికీ వెళ్ళవద్దన్నారు. అహమ్మద్‌నగర్ కయినాసరే వెళ్ళవద్దు అని చెప్పారు. ఏదైనా నౌకరీ దొరికితే మంచిదే. దొరికిన పని చేయండి. పని దొరకలేదా? ఇంటి దగ్గరే వుండండి. కాలక్షేపానికి దేవుడి పాటలు పాడండి. భజన చేయండి అని హితవు చెప్పారు.

తిరిగి వచ్చాక మీకు ఏదో ఒక ఉపాధి చూపిస్తానన్నారు. డ్రైవరు గానో, మెకానిక్ గానో ఏదో పనిలో కుదురుస్తామన్నారు. ప్రింటింగ్ పనులు నేర్చుకుంటున్నారు కాబట్టి ఆ వృత్తిలోనైనా మీకు ఉపాధి దొరికేలా చేస్తామన్నారు. ప్రస్తుతానికి చెప్పినట్లు చేయండి. మేలు జరుగుతుంది అని భరోసా పలికారు. ఒక్క శంకరనాథ్ తప్ప అందరూ బాబావారు చెప్పినట్లు చేస్తామన్నారు. నువ్వు ఎందుకు నామాట వినవురా అని అడిగితే, నాకు ఎక్కడికీ వెళ్ళాలని లేదు. నాకేమీ అక్కర్లేనూ లేదు. నన్ను ఇక్కడే మెహెరాబాద్‌లో వుండనిస్తే చాలు అన్నాడు. ఎవరెంతగా చెప్పినా శంకర్‌నాథ్ తన పట్టు వదల్లేదు. చివరికి బాబావారే "వాడి ఇష్టం, ఇక్కడే వుండనీయండి" అనక తప్పలేదు. అంత మొండి ఘటం వాడు. అయితే బాబావారొక షరతుపెట్టారు. రోజూ పన్నెండు గంటలు ధ్యానం చేయాలన్నారు. కుర్రాడికి కావాల్సిన తాయిలం దొరికాక ఒకటి కాదు వంద షరతులకైనా తయారే. అందుకనే ధ్యానం చేయాలి అనగానే ఓ భేషుగ్గా రోజూ చేస్తానన్నాడు.

అలా మే 8వ తేదీన చేయవలసిన ఏర్పాట్లు చేసి బాబావారు మెహెరాబాద్ నుంచి బయలుదేరారు. ఆలీ అక్బరు, బువా సాహెబ్, ఛాన్జీ, ఛగన్, గుస్తాద్‌గారు, మాసాగారు, పెసూ తోటి ప్రయాణికులు. వీరి మొదటి మజిలీ నౌసేర్వాన్ సాథా ఇల్లు అక్బర్ ప్రెస్. అక్కడికే చేరారు రమ్జూ, బైలీ కూడా. ఇంతకీ ఎక్కడికి వెళ్ళాలనుకొంటున్నారు? ఫలానా చోటని ఇంకా నిర్ణయించలేదు. అందుకనే ఎవరికి తోచిన సలహా వాళ్ళు ఇచ్చారు. ఎవరి సలహా నచ్చ లేదు బాబావారికి. ఋషీకేష్‌కి వెళ్ళాలని వుంది అన్నారు. ఈశ్వరేచ్ఛకి అడ్డం చెప్తారా ఎవరైనా. అంతే ఋషికేష్‌కే ప్రయాణం ఖాయమైంది. ఉత్తరదేశ యాత్రకి నాంది జరిగింది. రమ్జూ, బైలీ మాత్రం మెహెరాబాద్‌కి వాపసు వచ్చారు. ఆఘూ ఆలీ, అబ్దుల్లా, దస్తూర్, రావ్ సాహెబ్, సిద్దూ, ఇతర మండలివారు దిగువ మెహెరాబాద్‌లో వుంటామన్నారు. బాబావారి తమ్ముడు జాల్, మిగిలిన ప్రేమాశ్రమం పిల్లలు ఎగువ మెహెరాబాద్‌లో వుంటామంటూ మళ్ళా కొండ ఎక్కారు. షాహనే, బొమాన్ గార్ల కుటుంబాలు ఫ్యామిలీ క్వార్టర్లలో వున్నాయి. రమ్జూ భార్యా పిల్లలు పూనాలో వాళ్ళ ఇంటిలో వున్నారు.

మే తొమ్మిదవ తేదీన బాబావారు నగర్ నుంచి నాసిక్ వచ్చారు. అక్కడ అప్పటికే మెహెరా, నాజా, ఖోర్షేద్, సూనా, వాలూ, ఫ్రీనీ, రుస్తుం, పాద్రీ వున్నారు. బాబావారు పాద్రీని బొంబాయి పంపారు. నాసిక్‌లోనే వుండమన్నారు రుస్తుంని. స్త్రీమండలి మంచీ చెడ్డ చూడమన్నారు. తామేమో హిమాలయాలకి బయలుదేరారు. **(సమాప్తం)**

# మెహెర్‌స్థాన్ పసిడి పండుగ వేడుకలు

(పి.యస్.కె.శర్మ,హైదరాబాద్)



మెహెర్‌స్థాన్ పసిడి పండుగ వేడుకలు కొవ్వూరులో 2013 ఫిబ్రవరి 26, 27, 28 తేదీలలో ఘనంగా జరిగాయి. సుమారు 3 వేలకుపైగా బాబా ప్రేమికులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్, లక్నో, కాన్పూరు, మహారాష్ట్రలోని పూణే, ముంబాయి, అహ్మద్‌నగర్, అమరావతి, నాగపూర్, కర్నాటక, అలాగే న్యూ ఢిల్లీ, డెహ్రాడూన్ తదితర ప్రాంతాల నుండి రమారమిన వెయ్యిమంది బాబా ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విచ్చేసిన బాబా ప్రేమికులందరికీ స్థానిక మెహెర్‌స్థాన్ ధర్మశాలలో – అనేక ప్రైవేటు ఫంక్షన్ హాల్సు, స్థానిక హోటళ్ళుతోపాటు స్థానిక బాబా ప్రేమికుల ఇళ్ళలో వసతి సౌకర్యం కల్పించారు.

ఈ సందర్భంగా ఫిబ్రవరి 26 సాయంత్రం 4 నుండి ఫిబ్రవరి 28 సాయంత్రం 5 గంటల వరకు ఏకబిగిన పలు బాబా విశేష కార్యక్రమాలు నిర్వహించారు.

ఫిబ్రవరి 26 సాయంత్రం **మెహెర్‌బాబా దర్శన్** టవర్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. 1953లో మెహెర్‌బాబా కొవ్వూరులో ఇచ్చిన ప్రజాదర్శనానికి జ్ఞాపకంగా ఈ స్థూప నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం ఏడు గంటలకు బాబా ప్రార్ధనల అనంతరం ఉ. 7.30 నిముషాలకు ఆంధ్రా సెంటర్ అధ్యక్షులు శ్రీ బి. రామకృష్ణయ్య సప్తవర్ణపతాకావిష్కరణ చేశారు. శ్రీ కోడూరి ప్రసాద్ బాబా ప్రేమికులందరికీ స్వాగత వచనాలు పలికారు. ఆ పిదప మెహెరాబాద్ నుండి విచ్చేసిన బాబా ట్రస్టీ సభ్యులు శ్రీ జాల్.పి.దస్తూర్, శ్రీమతి డాలీ దస్తూర్, శ్రీ శ్రీధర్ కేల్కర్, శ్రీ రమేష్ జంగ్లీ, శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ బాబా సందేశాలపై ప్రసంగించారు. మెహెర్‌స్థాన్ విశాల ప్రాంగణంలో వున్న రెండు గదుల విశ్రాంతి భవనం ప్రక్కనే విశాలమైన సభావేదిక ఏర్పాటు చేశారు. ఇక్కడ నుండే పలువురి బాబా ప్రేమికుల ఉపన్యాసాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మూడ్రోజుల సమావేశాలలో శ్రీ మున్‌గాలాల్ (నవరంగా)



శ్రీ తోట నాగేశ్వరరావు, శ్రీమతి జి. సుబ్బలక్ష్మి, శ్రీ పి.సి. నిగం, హమీర్‌పూర్, శ్రీ సోరబ్ – రుస్తుంలు, శ్రీ ప్రతాప్ ఆహిర్, శ్రీ గౌరీ శంకర్ దుబే, శ్రీ హన్సపాల్, శ్రీ వార్డ్ పార్క్స్, శ్రీ కె.కె. శ్రీవాత్సవ్, తదితరులు సుమారు 20 మందిపైగా వక్తలు బాబా సందేశాలపై ప్రసంగించారు. **"మహాక్షేత్రం మెహెర్‌స్థాన్"** పేరిట విశాఖ సెంటర్‌వారు ఒక చక్కని నాటికను ప్రదర్శించారు. శ్రీ వల్లూరి నాగేశ్వరరావు దర్శకత్వంలో శ్రీ హరిమెహెర్ మెహెర్‌బాబా పాత్రధారణ చేసాడు. శ్రీ సి.వై. చింతామణి బృందం, విజయనగరం, శ్రీ గోపీ & బృందం, హైదరాబాద్,శ్రీ మెహెర్‌సాయి సంగమం, తమిళనాడు సెంటర్, శ్రీ శ్రీనివాసరావు బృందం, శ్రీకాకుళం, శ్రీ ప్రతాప్ ఆహిర్ & బృందం, పూణే, శ్రీమతి సుశీల & శైలజ బృందం, శ్రీ సి.హెచ్. గాంధీ & బృందం, కాకినాడ, శ్రీ మాణిక్ ఉబాలే , నాగపూర్ బృందం, తమ భజనలు, అనేక బాబా కీర్తనలతో ప్రేమికులనందరినీ ఓలలాడించారు. ఫిబ్రవరి 27న సాయంత్రం 3 నుండి 5 గంటల వరకు **బాబా నామధున్** నిర్వహిస్తూ పెద్దఎత్తున నగర సంకీర్తన గొప్ప ఆకర్షణీయంగా జరిగింది. కాన్పూర్ నుండి విచ్చేసిన హరిరాం పార్టీ బృందం నగర సంకీర్తన ముందుండి లయబద్ధంగా నగర సంకీర్తనను నడిపించారు. మెహెర్‌స్థాన్ స్వర్ణోత్సవాలలో భాగంగా శ్రీ శ్రీనిబాబు, చెన్నై రూపొందించిన **"సుధామయం – మెహెర్‌స్మరణం"** సిడిలను, మెహెర్‌స్థాన్, కొవ్వూరు సావనీర్‌లను ప్రత్యేకంగా ఆవిష్కరించారు. **మన మెహెర్‌స్థాన్ –**సంగీత నృత్యరూపకాన్ని శ్రీ శ్రీనివాసరావు,





శ్రీ కామేశ్వరరావు, శ్రీకాకుళం సెంటర్ ఆధ్వర్యంలో చక్కగా ప్రదర్శించారు. నృత్యరూపకాన్ని తిలకించిన బాబా ప్రేమికులు అమితానందభరితులయ్యారు. బాబా ప్రేమికులు డా॥ బి.హెచ్. కేశవరావు, శ్రీ కె.వి. రత్నం, శ్రీ ఎన్.వి.ఎస్. సత్యనారాయణ, శ్రీమతి నోరి స్వర్ణ, శ్రీ మెహెర్ ప్రసాద్, శ్రీ కె. మోహన్, శ్రీ సి. రామ్మోహన్, శ్రీ కనకయ్య తదితరులు మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవం నాటి తమ మధురస్మృతులు వివరించారు. అవతారుని చిత్రపటాలతో స్వాగత బోర్డులు, హోర్డింగులను, స్వాగత ద్వారాలను రాజమండ్రి–కొవ్వూరుల నడుమ పలు ప్రధాన కూడళ్ళలో ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాలకు మెహెర్ చైతన్య నికేతన్, మండపేట నుండి బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో హాజరయ్యారని, స్థానిక బాబా ప్రేమికులు కూడా తమకు ఎంతో ప్రేమతో స్వాగతం పలికారని వారు తెలిపారు. విచ్చేసిన యావన్మంది ప్రేమికులకు భోజన – ఫలహారాలను ఎలాంటి విసుగూ – విరామం లేకుండా ఏర్పాటుచేశారు. తెల్లవారుఝామున 5 నుండి రాత్రి పొద్దుపోయే వరకు బాబా ప్రేమికులందరికీ మెహెర్‌స్థాన్ ధర్మశాల యాజమాన్యం 'టీ' సౌకర్యం కల్పించింది. మెహెర్‌బాబా మెహెర్‌స్థాన్‌లో కొలువైవున్నానన్నారు. బాబా మాట మా విషయంలో నిజమైందని, అవతారుడు మాకు చక్కని దర్శనం ఇచ్చారని పలువురు బాబా ప్రేమికులు తమ అనుభూతుల్ని వివరించారు. చక్కని పాదస్పర్శ భాగ్యం కల్పించారన్నారు కొందరు. అవతార్ మెహెర్‌బాబా దివ్యమంగళ దర్శన భాగ్యం ప్రతి ఒక్కరూ మెహెర్‌స్థాన్‌లో పొందారు. మెహెరాబాద్ తర్వాత దేశం మొత్తంలో మెహెర్‌స్థాన్‌లో మాత్రమే మెహెర్‌బాబా సహవాస్ అత్యంత ఉన్నతస్థాయిలో జరిగిందని పలువురు బాబా ప్రేమికులు అభిప్రాయపడ్డారు. గత 50 సంవత్సరాలలో నేను చూసిన అతిపెద్ద సహవాస్ కార్యక్రమం మెహెర్‌స్థాన్ పసిడి పండుగ వేడుకలని శ్రీ నోరి హనుమంతరావు, హైదరాబాద్ అన్నారు. స్థానిక బాబా ప్రేమికులు శ్రీ ప్రసాదరాజు, శ్రీ ఏ. నారాయణరావు, శ్రీ మెహెర్ మూర్తి ఇలా ఒకరేమి అనేకమంది బాబా ప్రేమికులు అత్యుత్తమ సేవలందించారు. రమారమిన నూరు మంది బాబా ప్రేమికులు వాలంటీర్లుగా పనిచేశారు. ❀

# ప్రత్యేక ఎగ్జిబిషన్

**-లక్ష్మీ కృష్ణమూర్తి, కాకినాడ**

స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా మెహెర్‌స్థాన్‌కు సమీపంలో మెహెరాజాద్, మెహెరాబాద్‌లో ఉండే భవన నమూనాలు, మెహెర్‌బాబా గాడ్ స్పీక్స్ గ్రంధంలో ప్రవచించిన ఆత్మ ప్రయాణం అంశాలపై ఒక ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అలాగే, మెహెర్‌బాబా కొవ్వూరుకి వచ్చినప్పుడు ఆయన వాడిన పందిరి మంచాన్ని సందర్శకులకొరకు వుంచారు.

మెహెరాజాద్, మెహెరాబాద్‌లో ఉండే భవన నమూనాలను హైదరాబాద్ కోఠి సెంటర్‌వారు తయారుచేసి ఈ ప్రదర్శనలో ఉంచారు. ఆయా ప్రదేశాలను విహంగ వీక్షణంగా దర్శించినట్లు చూపరులను ఆకర్షించింది. మెహెరాబాద్, మెహెరాజాద్‌లు అవతారునితో పాటు కొవ్వూరుకి వచ్చేశాయా? అన్నట్లు అందరిని అలరించాయి. బాబా సమాధి, దాని ఎదురుగా ఉన్న వేదిక, మెహెర్ రిట్రీట్ దానిపై ఎగురుతున్న జెండా, బాబా నడచిన దారి ప్రక్కనున్న చెట్లు దిగువ మెహెరాబాద్‌కు ముందున్న రైలు మార్గం, రోడ్డు మార్గం ఎ,బి,సి,డి హాస్టల్స్ అన్నింటికి చక్కని మోడల్స్ తయారుచేసి అందంగా అమర్చారు. అలాగే మెహెరాజాద్‌లోని మండలి హాలు, మండలి నివాస భవనాలు, ప్రక్కగా బాబా గది, వాటి చుట్టూ గల తోట చాలా చక్కగా రూపొందించారు. సందర్శకులకు శ్రీమతి గౌరి, శ్రీమతి నోరి స్వర్ణ సూర్యనారాయణ ఆసక్తికరంగా వివరించి పలు విషయాలు తెలియజేశారు. ఇదే ప్రదర్శనను ఇటీవల హైదరాబాద్‌లోని కోఠి సెంటర్, జూబ్లీ బాబా సెంటర్‌లలో కూడా బాబా జన్మదినోత్సవ వేడుకలలో ఏర్పాటు చేశామని శ్రీమతి నోరి స్వర్ణ తెలిపారు.

**భగవద్వచనము -చార్ట్ నెం. 8 ఎ -ఆత్మ ప్రయాణం -**

అవతార్ మెహెర్‌బాబా ప్రవచించిన భగవద్వచనం అనే గ్రంథంలో సృష్టి, పరిణామక్రమం, జన్మ పునర్జన్మలు, అంత:పరిణామం మరియు భగవదనుభవం గురించి స్పష్టంగా వివరించారు. మెహెర్‌బాబా స్వయంగా పర్యవేక్షిస్తుండగా **'రానో గేలీ'** అను పాశ్చాత్య మహిళ ఈ చిత్రాన్ని రూపొందించారు.

మెహెర్‌స్థాన్‌లో ఆ రంగుల చిత్రాన్ని బొమ్మల రూపంలో కాకినాడకు చెందిన బాబా ప్రేమికులు ప్రదర్శించారు. మరింత వివరంగా చెప్పుకోవాలంటే...

పరాత్పర **పరబ్రహ్మస్థితి**. ఇందులో భగవంతుడు పరిశుద్ధ ఆత్మ, అనంతము, ఆది మూలము, శాశ్వతము, స్వచ్ఛము అయిన స్థితిలో ఉంటాడు. ఈ స్థితి వర్ణించ శక్యముకానిది. సిద్ధాంతీకరించలేనిది. తరువాత **పరమాత్మ స్థితి**. ఇక్కడ భగవంతుడు



పరాత్పర పరబ్రహ్మ స్థితిలో వలెనే ఉంటాడు. కానీ ఈ స్థితిలో భగవంతుడు సత్, చిత్, ఆనంద స్వరూపుడు. ఈ స్థితిలో ఆయనకు తననుతాను తెలుసుకోవాలనే ప్రేరణ కలుగుతుంది. **"నేను ఎవరిని?" "కో అహం?",** ఈ ప్రశ్నకి సృష్టి ప్రారంభమైంది.

అలా ప్రారంభమైన సృష్టి నుండి అనగా ఓం బిందువు నుండి తొలి రూపాలు బయలుదేరాయి. పరమాత్మ నుండి బయటపడిన ఆత్మలు తొలిరూపమైన వాయువు వంటి స్థితిని పొందుతాయి. చైతన్యం ఉదయించి క్రమపరిణామం చెందుతుంది. దానితోపాటు ఆత్మ అనేక రూపాలను పొందుతూ ప్రయాణం సాగిస్తుంది. చైతన్య పరిణామం, రూప పరిణామంతో పాటు సంస్కారాలు కూడా ముద్రితమవుతాయి.

అనేకానేక వాయు రూపాల తరువాత ఆత్మ శిలారూపం సంతరించుకుంటుంది. అనేకానేక శిలారూపాలు అనగా సాధారణ గులకరాయి నుండి ప్రశస్తమైన, విలువైన వజ్ర వైఢూర్యాల వంటి రాతి రూపాలు పొందుతూ స్థూల ప్రపంచానుభవం పొందుతుంది. తరువాత ఆత్మ ఖనిజరూపాన్ని పొందుతుంది. అన్ని ఖనిజ జాతుల రూపాలు అనగా బంగారము, రాగి, ఇనుము, ఇలా అన్ని లోహ రూపాలను పొంది తరువాతి పరిణామ రూపమైన వృక్ష రూపాన్ని పొందుతుంది. అన్ని వృక్ష జాతి రూపాలను పొంది ప్రాణమున్న జీవిగా తన ఉనికిని చాటుతూ భూమిపై స్థిరంగా నిలబడుతుంది. స్థూల ప్రపంచంలో అనేక అనుభవాలను, వాటితోపాటు సంస్కారాలను పొందుతూ తరువాతి రూపమైన క్రిమిగా జన్మిస్తుంది. ఈ స్థితిలో జీవం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అన్ని క్రిమి రూపాలను పొంది చివరకు ఆత్మ చేప రూపంలో పుడుతుంది. నీటిలో మాత్రమే జీవించగలిగే అన్ని రూపాలను పొంది చివరకు నేల మీద జీవించే రూపాలను తరువాత పక్షి రూపంలో జన్మిస్తుంది. ఆకాశయానం చేయగలిగే అన్ని పక్షి రూపాలను పొంది చివరకు జంతు రూపాన్ని ధరిస్తుంది.  పక్షి జాతిలోని రెక్కలు జంతు రూపంలో ముందు కాళ్ళుగా



రూపాంతరం చెందుతాయి. నాలుగు కాళ్ళతో భూమిపై సమాంతరంగా నడయాడే జంతువుగా అన్ని రూపాలను పొందతూ ప్రయాణం సాగిస్తుంది. చివరకు ఆత్మ మానవునిగా జన్మిస్తుంది. ఈ దశలో చైతన్య పరిణామం పరిపూర్ణమవుతుంది. రూప పరిణామం కూడా చివరి దశకు చేరుకుంటుంది. మనస్సు చక్కగా వికసించి ప్రపంచానికి సంబంధించిన పూర్తి జ్ఞానం కలిగి ఉంటుంది. మానవ రూపం **"నేను భగవంతుడనే"** బ్రహ్మానుభవాన్ని పొందడానికి అర్హత కలిగి వుంటుంది. కానీ, ఈ దశలో రాతి దశ నుండి పోగుపడిన సంస్కారాలు మనసు యొక్క చైతన్యంలో ముద్రింపబడి ఉంటాయి. మానవుడు ఒకసారి స్త్రీగా మరొకసారి పురుషునిగా, ఒకసారి నిరుపేదగా మరొకసారి ధనవంతునిగా ఇలా ఒక జన్మ తరువాత మరొక జన్మ ఎత్తుతూ ముద్రింపబడిన సంస్కారాలను ఖర్చుచేస్తాడు. కానీ అదే సమయంలో మరిన్ని క్రొత్త సంస్కారాలు వచ్చిచేరుతాయి. వాటిని అనుభవించడానికి మరో జన్మ అవసరమవుతుంది. అలా మానవుడు జన్మ, పునర్జన్మ చక్రంలో పడి తిరుగుతూ **84 లక్షల జన్మలు** గడిచాక మోక్షానికి అనగా భగవంతునిలో ఒకటైపోవడానికి అర్హుడవుతాడు. స్థూల సంస్కారాలు అనుభవించాక మానవుడు అంతర్ముఖుడై భగవంతుని చేరాలనే కాంక్షతో ప్రపంచంపై విముఖత కలిగి ఉంటాడు. అటువంటి అంతర్ముఖ ప్రయాణం ప్రారంభమై సూక్ష్మ ప్రపంచంలోని సూక్ష్మ భూమికలో ప్రవేశిస్తాడు. 1,2,3 భూమికలు సూక్ష్మ ప్రపంచానికి చెందినవి. 5,6 భూమికలు మనో ప్రపంచానికి చెందినవి. 4వ భూమిక రెండు ప్రపంచాలకు (సూక్ష్మ, మనో ప్రపంచాలకు) మధ్య ద్వారం. ఈ భూమికలలో ప్రయాణించే మానవునకు అనేక శక్తులు సంక్రమిస్తాయి. 6వ భూమికలో వున్న సాధకుడు భగవంతుని ప్రత్యక్షంగా చూడగలడు. కానీ అక్కడ నుండి భగవంతునితో ఐక్యమవడానికి అనగా 7వ భూమికకు చేరాలంటే ఆ స్థితిలో సద్గురువు లేక అవతారుని సహాయం అవసరమవుతుంది. అక్కడ సాధకుడు **అహం బ్రహ్మస్మి స్థితి**ని పొందుతాడు. అనగా నేనే భగవంతుడను అనే స్థితి. అలా పరమాత్మ నుండి సృష్టి ద్వారా



బయట పడిన ప్రతి ఆత్మ వివిధ రూపాలలో ప్రయాణిస్తూ చివరకు మానవునిగా జన్మించి మోక్షగామియై ప్రయాణం సాగించి చిట్టచివరకు పరమాత్మలో ఐక్యమవడమే సృష్టి ప్రయోజనం.

తెలుగువారికే గాక ఇతర రాష్ట్రాలకు చెందిన బాబా ప్రేమికులు అందరూ ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. మానవులమైన మనమంతా పరిణామ క్రమంలో ఎలా ప్రయాణం చేసి వచ్చామో తెలుసుకుని ఆశ్చర్యపోయారు. మనమంతా పుట్టి కొన్ని యుగాలైందని విని ఓ! అంటూ అచ్చెరు వొందారు. ఈ ప్రదర్శన చూస్తూ, మనం ఏ భూమికలో ఉన్నామని కొందరు ఆశ్చర్యంతో అడిగారు. ఎవరైనా ఏ భూమికలో ఉన్నారో తెలుసుకోవడమెలా? అంటూ జిజ్ఞాసతో ప్రశ్నించారు. అసలు భూమికలంటే ఏమిటి? అని మరికొందరు అనుమానం వ్యక్తం చేశారు. గాడ్ స్పీక్స్ అర్థం కాదని భావించేవారు కూడా ఈ ప్రదర్శన చూసి ఆత్మ ప్రయాణం గురించి తెలుసుకుని తృప్తిచెందారు. బాబా ప్రేమికులే కాక అనేకమంది ఈ ప్రదర్శనను శ్రద్ధగా చూసి క్రొత్త విషయాలు తెలుసుకున్నామని తృప్తిచెందారు.



బాబా సోదరుని కుమారులైన సోరబ్, రుస్తుంలు, బాబా ప్రేమికులు శ్రీమతి డాలీ దస్తూర్ తదితరులు చాలామంది ప్రదర్శనచూసి ముచ్చటపడ్డారు. మొత్తానికి కొవ్వూరు మెహెర్‌స్థాన్ స్వర్ణోత్సవ వేడుకలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

# డా॥ ఎ.కె. వసుమతి బాబాలో ఐక్యం

**(14.05.1927 - 01.03.2013)**



**చె**న్నైలోని బాబా ప్రేమికులు సంపత్ అయ్యంగార్ గారి మనుమరాలు డా॥ వసుమతి. ఎ.కె. 2013 మార్చి ఒకటిన బాబాలో ఐక్యమయ్యారు.

చెన్నై లోని సైదాపేటలో మెహెర్‌బాబా స్వయంగా **'మెహెర్ ఆశ్రమాన్ని'** 1930 మార్చి 1న ప్రారంభించారు.

మెహెరాశ్రమం చెన్నైలో ఏర్పాటుచేసి మార్చి 1 నాటికి 83 సంవత్సరాలు నిండుతున్నాయి. సరిగ్గా 2013 మార్చి 1న డా. వసుమతి 85 సంవత్సరాల వయస్సులో బాబాలో ఐక్యమయ్యారు. చిన్నతనం నుండి వసుమతి మెహెర్‌బాబా ప్రేమ వాతావరణంలోనే గడిపింది.

1930-1947 మధ్య కాలంలో మెహెర్‌బాబా పలు సందర్భాలలో బెంగళూరు, మద్రాసులోని సంపత్ అయ్యంగార్ గృహానికి విచ్చేశారు. ఈ పర్యటనలో రమారమిన 20 రోజులపాటు సంపత్ అయ్యం గారి ఆతిధ్యాన్ని అవతారుడు స్వీకరించాడు. ఆ మాదిరిగా చిన్నతనంలో బాబా వారింటికి వచ్చినప్పుడల్లా తన సోదరునితో కల్సి అవతారునితో అనేక ఆటలు ఆడుకుందామె.

ఆమె పి.హెచ్.డి పూర్తిచేసుకుని ముంబాయిలో Lever Brothers కంపెనీలో ఉన్నతోద్యోగినిగా స్థిరపడింది. ఈ సమయంలో ఆమె బాబాని పూణే, ముంబాయిలలో పలుదఫాలు దర్శించుకుంది. వసుమతి తల్లిపేరు జానకి. తమ కూతురు తమకు దూరంగా ముంబాయిలో వుంటోంది బాబా అని బాబాకు లేఖ రాస్తే Don't worry. My Nazar is always on her అని బాబా భరోసా ఇచ్చారు. బాబా సాన్నిధ్యంలో అనేకమార్లు గడిపిన డా॥ వసుమతి ధన్యురాలు. 1958 ఫిబ్రవరి ఐదురోజుల సహవాస్‌లో, 1958 ఫిబ్రవరి 25న బాబావారి 64వ జన్మదినోత్సవాలలో, 1962 నవంబరు పూనేలో జరిగిన ఈస్ట్ - వెస్ట్ గేదరింగ్‌లో బాబాతో ఎంతో సన్నిహితంగా వుందామె. **మెహెరా** బర్త్‌డే సందర్భంగా 1963 డిసెంబరు 23న మెహెరాజాద్‌లో ఏర్పాటుచేసిన The All Womens'

Dayలోఆమెకు పాల్గొనే అరుదైన అవకాశం బాబా కల్పించారు. 1965 మేలో పూనేలో ప్రజాదర్శనంలో ఆమె బాబాని దర్శించుకుంది.

అంతేకాదు అవతారుని మూడు ప్రధాన జన్మదినోత్సవాలు –

**40వ జన్మదినోత్సవం – 1934, మద్రాసు,**

**42వ జన్మదినోత్సవం – 1936, బెంగుళూరు,**

**64వ జన్మదినోత్సవం–1958, మెహెరాబాద్‌లలో** ఆమె పాల్గొని అవతారుని ఆశీశ్శులు అందుకుంది. ఆమె ముంబాయిలో ఉద్యోగరీత్యా పదవీ విరమణానంతరం చెన్నైలోని **'మెహెరాశ్రమం'** బాగోగులు చూసుకుంటూ మద్రాసులో స్థిరపడింది.

మెహెరాశ్రమాన్ని 10.07.1987లో మౌనదినం రోజున ఆమె 'Temple of Silence'గా నామకరణం చేసింది. ఆ రోజున బాబా సన్నిధిలో మెహెరాబాద్ బాబా సమాధి దగ్గర వుందావె. మెహెరాశ్రమానికి **'Temple of Silence'గా** తీర్చిదిద్దాలనుకుంటున్న సందర్భంలో అనుకోని రీతిలో పెద్ద వాన – సమాధి పైభాగాన ఏడు రంగుల హరివిల్లు ఆమె ఆలోచనకు బాబావారి'ఆనతి' లభించినట్లు దర్శనమిచ్చాయి.

మెహెరుడు ప్రారంభించిన మెహెరాశ్రమంలో మౌనంగానే ప్రార్థనలు చేయాలని, మౌన దేవాలయంగా ఆమె అభివర్ణించారు.

బాబా ఇక్కడ రావి చెట్టును నాటారు.

ఆ చెట్టు నీడన ఏప్రిల్ 1947లో బాబా తన ప్రేమికులకు దర్శనం ఇచ్చారు.

చైన్నైకి వెళ్ళే బాబా ప్రేమికులు ప్రతి ఒక్కరూ 'Temple of Silence'ను తప్పక దర్శించాలనుకోవడం ముదావహం.

# ఆంధ్రా రెస్టుహౌసు

వేసవి సెలవులలో మెహెర్‌బాబా వద్దకు విచ్చేసే బాబా ప్రేమికులందరికీ ఆంధ్రా రెస్టుహౌసు, మెహెరాబాద్ స్వాగతం పలుకుతోందని కార్యదర్శి శ్రీ వై.ఎస్. రావు ఒక ప్రకటనలో తెలిపారు. మెహెర్‌బాబా మౌన వార్షికోత్సవం, 2013 జూలై 10, నాటికి రెస్టుహౌస్‌లో ప్రస్తుతమున్న డైనింగ్ రూంను ప్రేమికులకు వసతి కేంద్రంగా మార్పుచేసి, డైనింగ్‌హాలును ప్రక్కనే గల వేరొక ప్రదేశానికి మార్చి తగిన ఏర్పాటుచేస్తున్నట్లు శ్రీ రావు తెలిపారు. తద్వారా రెస్టుహౌసులో అదనంగా మరో 50 మందికి వసతి సౌకర్యం కల్పించ వీలౌతుందన్నారు. బాబా ట్రస్టు ఆంధ్రా రెస్టుహౌసుకు మంచినీటి సరఫరాను నిలిపివేసిన సంగతి పాఠకులందరికీ తెలుసు. ఐనప్పటికీ, ట్రస్టీ సభ్యులు శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ, హైదరాబాద్ ప్రేమికులు శ్రీ హనుమంతరావు (ఎల్.ఐ.సి) సహకారంతో 44వ అమరతిథిలో రెస్టుహౌసులో బసచేసిన సుమారు 400 మంది ప్రేమికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీటి సరఫరా చేశామన్నారు.

# అవతార్ మెహెర్‌బాబా 119 వ జన్మదినోత్సవాలు

## జంట నగరాలలో...

అవతార్ మెహెర్‌బాబా 119వ జన్మదినోత్సవాలను జంట నగరాలలోని పలు ప్రాంతాల్లో, పలువురి ఇండ్లలో బాబా ప్రేమిక సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రధానంగా మెహెర్‌బాబా జన్మదిన వేడుకలను ఫిబ్రవరి 25 తెల్లవారు ఝామున 5 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జూబ్లి సెంటర్‌లో, తిరిగి అదేరోజు సా. 5 నుండి రా. 8.30 వరకు ఈసామియా బజార్‌లోని కోఠి సెంటర్‌లో ప్రత్యేక ప్రేమిక సహవాస్‌లు నిర్వహించారు.

ఆ తదుపరి ఫిబ్రవరి 23న మల్కాజ్‌గిరి సెంటర్‌లో, ఫిబ్రవరి 24 మైలార్‌గడ్డ, సికింద్రాబాద్ సెంటర్‌లో బాబా జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు.

మార్చి 1న, కోఠి సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు బాబా ప్రేమికులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఖమ్మం

అవతార్ మెహెర్‌బాబా 119వ జయంత్యుత్సవ వేడుకలు ఖమ్మం కేంద్రములో ఘనంగా జరిపినట్లు సెంటర్ అధ్యక్షులు శ్రీ ఆర్. రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రోగులకు పండ్లు పంచడంవంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

## కంకల్ బాబా సెంటర్ 32వ వార్షికోత్సవం

నిజామాబాద్ జిల్లాలోని కంకల్ బాబా సెంటర్ 32వ వార్షికోత్సవాన్ని 10.03.2013న ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 – 8 నగర సంకీర్తన కడు వేడుకగా జరిగింది. శ్రీ జనార్ధనరావు, డా॥ రామిరెడ్డి, బి. రామకృష్ణ, శ్రీ పి.ఎస్.కె. శర్మ, శ్రీ ఆర్.టి.సి. రమణ, శ్రీ ప్రకాశరావు, శ్రీ గంగయ్య, పన్నగేశ్వరరావు బాబా సందేశాలపై ప్రసంగించారు. కార్యదర్శి శ్రీ రాఘవరెడ్డి సమర్ధవంతంగా నిర్వహించారు. చి॥ స్నిగ్ధ నృత్యం పలువురి ప్రేమికుల్ని ఆకట్టుకుంది.

## మెహెర్ మండపేట బాబా సెంటర్ 59వ వార్షికోత్సవం

మండపేట బాబా సెంటర్ 59వ వార్షికోత్సవం 10.03.2013 ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు సెంటర్ అధ్యక్షులు శ్రీ యం. పనసన్న, కార్యదర్శి సి.ఎ. చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

## రాజాం

ఫిబ్రవరి 25న అవతార్ మెహెర్‌బాబా 119 వ జన్మదినోత్సవాన్ని శ్రీకాకుళం జిల్లా రాజాంలో ఘనంగా జరుపుకున్నట్లు బాబా ప్రేమికులు శ్రీ పివి రమణమూర్తి తెలిపారు. అదే రోజున సాయంత్రం పురవీధులలో బాబా చిత్రపటాన్ని ఊరేగింపుగా బాబా నామ సంకీర్తన చేశామని ఆయన అన్నారు. శ్రీ కె.యస్. ప్రకాశరావు, బ్యాంకు మేనేజరు, యస్.బి.హెచ్. సప్తవర్ణ పతాకాన్ని అవిష్కరించారు.

## కామారెడ్డి

అవతార్ మెహెర్‌బాబా 119వ జన్మదిన మహోత్సవము స్థానిక అవతార్ మెహెర్‌బాబా కామారెడ్డి సెంటర్ నందు 25.02.2013 జరుపుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## గోదావరిఖని

25.02.2013 ఉ. 5.00 గం. అవతార్ మెహెర్‌బాబా జనన సమయమున హారతి, పండుగ రమణ, హైదరాబాద్ గారిచే ఉ. 8.05 ని.లకు సప్తవర్ణ పతాక ఆవిష్కరణ, అనంతరం ధుని ప్రజ్వలన, బ్రహ్మాండమైన ఊరేగింపు జరిపినట్లు శ్రీ రామోహన్‌రావు, అధ్యక్షులు, గోదావరిఖని సెంటరు ఒక ప్రకటనలో తెలిపారు.

## విజయవాడ

అవతార్ మెహెర్‌బాబా 119వ జన్మదిన మహోత్సవము స్థానిక అవతార్ మెహెర్‌బాబా విజయవాడ సెంటర్ నందు 04.02.2013 నుండి 25.2.2013 వరకు జరుపుకున్నట్లు ఆహ్వానం పంపారు.

## జోగిపేట

అవతార్ మెహెర్‌బాబా 119వ జన్మదిన మహోత్సవము స్థానిక బాబా జోగిపేట సెంటర్ నందు 25.02.2013 జరుపుకున్నట్లు శ్రీ వెంకటేశ్వరరావు తెలిపారు.

## కరీంనగర్

అవతార్ మెహెర్‌బాబా 119వ జయంత్యుత్సవ వేడుకలు 01.02.2013 నుండి 25.02.2013 వరకు కరీంనగర్ కేంద్రములో జరిపినట్లు సాయినగర్ సెంటర్ అధ్యక్షులు, ఒక ప్రకటనలో తెలిపారు.

## తాడేపల్లిగూడెం

అవతార్ మెహెర్‌బాబా 119వ జన్మదిన మహోత్సవము స్థానిక బాబా సెంటర్ నందు 25.02.2013 ఘనంగా జరుపుకున్నట్లు డా. విజయసారధి తెలిపారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశనములేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు,
అల్లాహ్, ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

## పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

## మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యతం

**2013 ఫిబ్రవరి-మార్చి నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1 | మార్చి | ఎల్. గణపతి రావు, విశాఖపట్నం | రు. 1000/- |
| 2 | మార్చి | ఇ. రవీందర్, రామాయంపేట, మెదక్ జిల్లా | రు. 500/- |
| | | **మొత్తం** | **రు. 1500/-** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ. 500/- చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ. 100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది.
5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్:** **ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం. 32,**
**జె.జె. నగర్ కాలనీ,**
**సికింద్రాబాద్-500087.**
**ఫోన్:99595-53218,**
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**